RNI NO: TEL/TEL/2009/28544

PEOPLES DAIRY

# పీపుల్స్ డైరీ

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

WANTED

రిపోర్టర్స్ కావలెను

తెలుగు రాష్ట్రాల్లో పీపుల్స్‌డైరీ దినపత్రికలో పనిచేయుటకు మండలాలు, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావలెను.

తెలుగు భాషపై పట్టు ఉండి రాజకీయ, సామాజిక అంశాలపై రాయగల నేర్పు కలిగిన అభ్యర్థులు క్రింది నెంబర్‌లలో సంప్రదించండి.

Cell : 6309623380, 9618509859

సంపుటి : 15 సంచిక : 125 | Vol : 15 Issue : 125 | Editor : KONDAPARTHI KIRAN CELL : 6309623380 | కరీంనగర్, శుక్రవారం 19 సెప్టెంబర్ 2025 Karimnagar, Friday 19 September 2025 | TELANGANA & ANDHRA PRADESH | పేజీలు : 08 వెల రూ : 4-00 | Pages : 08 Price : 4-00

## పండుగకు ప్రత్యేక బస్సులు

- టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం చర్యలు
- బతుకమ్మ, దసరాకు 7754 బస్సుల కేటాయింపు
- ఈనెల 20 నుంచి వచ్చేనెల 2 వరకు సౌకర్యం




**పీపుల్స్‌డైరీ, హైదరాబాద్ :** బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రజలకు రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ పండుగలకు రాష్ట్రవ్యాప్తంగా 7754 స్పెషల్ బస్సులను బస్సులను నడపడానికి ప్రణాళిక సిద్ధం చేసింది. అందులో 377 స్పెషల్ సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించింది. ఈ నెల 20 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక బస్సులను నడపనుంది. సద్దుల బతుకమ్మ ఈ నెల 30న, దసరా అక్టోబర్ 2న ఉన్నందున.. ఈ నెల 27 నుంచే (మిగతా 2లో...)


## ఈ నగరాలు మస్తు కాస్ట్‌లీ..!



- ఇండియాలో అత్యంత ఖరీదైన నగరాలివే...
- పేద, మధ్య తరగతి వర్గాలు సొంతిల్లు కట్టుకోవడం కష్టమే
- అంతర్జాతీయ నగరాలతో పోటీపడుతున్న మన సిటీలు
- ముంబై టాప్ 1, ఢిల్లీ సెకండ్ ప్లేస్
- బెంగుళూరు, హైదరాబాద్ ర్యాంకులివే....
- మెట్రో నగరాలపై సంచలన రిపోర్ట్..!!

**పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ :** భారతదేశంలోని ప్రధాన మెట్రో నగరాలు ఉద్యోగావకాశాలు, ఆధునిక జీవనశైలితో లక్షలాది మందిని ఆకర్షిస్తున్నాయి. కానీ, ఇప్పుడు ఈ నగరాలు నివాసానికి అత్యంత ఖరీదైన ప్రాంతాలుగా మారుతున్నాయి. జీవన వ్యయం విషయంలో ఇవి అంతర్జాతీయ నగరాలకు పోటీ ఇస్తున్నాయి. ప్రస్తుతం భారతీయ పెద్ద నగరాల్లో బతకి బట్ట కట్టాలంటే సామాన్యులు భయపడాల్సిన పరిస్థితి ఉంది. ముఖ్యంగా పేద, మధ్య తరగతి వర్గాలు మెట్రో నగరాల్లో కనీసం సెంటు స్థలం కొనడం కల అనే చెప్పవచ్చు. ప్రస్తుతం భారతదేశంలోని మెట్రో నగరాల్లో పరిస్థితి ఎలా ఉందో ఇక్కడ చదవండి. (మిగతా 2లో...)

## మెదడును మేస్తుంది!




**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** మెదడును తినే భయంకరమైన వైరస్ కారణంగా ఇప్పటి వరకు 19 మంది మృతి చెందారు. ఇప్పటివరకు 61 మంది ఈ ప్రాణాంతక వ్యాధి బారిన పడ్డారు. నిల్వ ఉన్న నీటి ద్వారా ఈ మెదడును తినే నెగ్లేరియా ఫౌలెరి అమీబా అనే అరుదైన వ్యాధి వ్యాప్తి చెందుతుందని వైద్యులు గుర్తించారు. ఈ మేరకు ప్రజలు బయట నీళ్లలో ముఖ్యంగా చెరువులు, కాలువలు, కుంటలు, సరస్సుల్లో స్నానాలు చేయొద్దని హెచ్చరికలు జారీ చేశారు.

అరుదైన వ్యాధులకు అడ్డాగా కేరళ రాష్ట్రం మారుతోంది. గతంలో నిఫా వైరస్ ఆ తర్వాత కొవిడ్-19 తొలి కేసు కూడా కేరళలోనే నమోదైంది. ఆ తర్వాత మిగతా రాష్ట్రాలకు విస్తరించింది. ఇప్పుడు బ్రెయిన్ ఈటింగ్ అమీబా.. ఇలా వరుస వైరస్ లు ఆ రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ వ్యాధి కేరళలో క్రమంగా విస్తరిస్తోంది. ఈ ఏడాది ప్రైమరీ అమోబిక్ మెనింజో ఎన్సెఫలైటిస్ (పామ్) ప్రాణాంతక వ్యాధి బారిన పడ్డవారి సంఖ్య 69 కు చేరింది.

(మిగతా 2లో...)

## ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దన్నందుకు యువకుడు సూసైడ్

- బీటెక్ చేసి ఇంట్లోనే ఉంటూ సెల్‌ఫోన్‌లో ఆటలు...
- వద్దని మందలించిన తండ్రి...
- చిన్న కారణానికే ఎంత పనిచేశావ్ బ్రో...
- విషాదంలో మునిగిన కుటుంబం



2వ పేజీలో..

2లో

## విద్యారంగ అభివృద్ధికి సహకరించండి...

- యూకే విశ్వవిద్యాలయాల్లో మా విద్యార్థులకు అవకాశాలు విస్తరించండి
- తెలంగాణ ఉపాధ్యాయులకు, ప్రొఫెసర్లకు శిక్షణ కావాలి
- ఇతర రంగాల అభివృద్ధిలో కూడా ముందుకు రండి
- బ్రిటిష్ హైకమిషనర్‌ను కోరిన సీఎం రేవంత్‌రెడ్డి
- సానుకూలంగా స్పందించిన బ్రిటన్ అధికారి...







2లో

## కవిత రాజీనామా ఆమోదంపై త్వరలో నిర్ణయం..

- పునరాలోచించుకోవాలని కవితకు సూచించా
- మండలి ఛైర్మన్ 'గుత్తా' కీలక వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

నివాసం: ఇల్లు లేదా ఫ్లాట్ అద్దెకు తీసుకోవడం, కొనడం అనేది ఈ నగరాల్లో ఒక పెద్ద సమస్యగా మారింది. భూమి అందుబాటులో లేకపోవడం, డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ఆస్తుల విలువలు, అద్దెలు ఆకాశాన్ని అంటుతున్నాయి. అటు జీతాలు ఎంత పెరిగినా సరే, నెల జీతంలో సింహభాగం ఇల్లు కట్టుకోవడం లేదా అద్దెకే సరిపోతుంది.

నిత్యావసరాలు: కిరాణా సామాన్లు, ఆహారం, విద్యుత్ వంటి నిత్యావసరాలు నిరంతరంగా ఖరీదైనవిగా మారుతున్నాయి. ప్రైవేట్ విద్య, ఆరోగ్య సంరక్షణ ఖర్చులు కూడా మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్‌పై తీవ్ర భారం మోపుతున్నాయి. వీటితో పాటు వినోదం, డైనింగ్ వంటి జీవనశైలి ఖర్చుల వలన పొదుపు చేయడం అనేది కష్టంగా మారింది.

**అత్యంత ఖరీదైన ఆరు నగరాలు**

ముంబై: ముంబై ఇప్పటికీ భారతదేశంలో అత్యంత ఖరీదైన నగరంగా ఉంది. మలబార్ హిల్, బాంద్రా వంటి ప్రాంతాల్లో చదరపు అడుగు ధర రూ.1 లక్ష కంటే ఎక్కువగా ఉంది. మధ్యస్థాయి అపార్ట్‌మెంట్ల అద్దె లక్షల్లో ఉంటుంది.

# ఈ నగరాలు మస్తు కాస్ట్లీ..



ఢిల్లీ: నేషనల్ క్యాపిటల్ రీజియన్ రెండవ స్థానంలో ఉంది. దక్షిణ ఢిల్లీ, గురుగ్రామ్, నోయిడా వంటి ప్రాంతాలలో రియల్ ఎస్టేట్ ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి. 2024లో అద్దెలు 12 నుంచి 15 శాతం పెరిగాయి.

బెంగళూరు: బెంగళూరులో కూడా కోరమంగళ, ఇందిరానగర్, వైట్‌ఫీల్డ్‌లలో అద్దెలు రికార్డు స్థాయికి చేరాయి. కొన్ని సర్వేల ప్రకారం, కొన్ని అంశాల్లో బెంగళూరు ముంబై, ఢిల్లీలను కూడా అధిగమించింది. ఆహార ద్రవ్యోల్బణం, ట్రాఫిక్ ఖర్చులు కూడా ఇక్కడ నివాసాన్ని కష్టతరం చేస్తున్నాయి.

హైదరాబాద్ : గతంలో అందుబాటు ధరలలో ఉండే హైదరాబాద్ ఇప్పుడు ముంబై తర్వాత దేశంలో రెండవ అత్యంత ఖరీదైన హౌసింగ్ మార్కెట్‌గా మారింది. హైటెక్‌సిటీ, గచ్చిబౌలిలో రూ.3 కోట్ల పైగా ఖరీదు చేసే లగ్జరీ ఇళ్లకు డిమాండ్ పెరిగింది. విద్య, వైద్యం, జీవనశైలి ఖర్చులు కూడా వేగంగా పెరిగి ఇతర మెట్రోలకు దగ్గరగా వస్తున్నాయి.

పూణే: ఐటీ, విద్య, ఆటోమొబైల్ హబ్‌గా పూణే పెరగడం వల్ల అద్దెలు, రియల్ ఎస్టేట్ విలువలు పెరిగాయి. కోరేగావ్ పార్క్, కళ్యాణి నగర్ వంటి ప్రాంతాలు ఖరీదైనవిగా మారాయి.

చెన్నై : ముంబై, ఢిల్లీలతో పోలిస్తే చెన్నై కొంత తక్కువ ఖరీదైనది అయినప్పటికీ, ఖరీదైన నగరాల జాబితాలో టాప్ ఆరులో ఉంది. అడయార్, అన్నా నగర్‌లలో నివాస ఖర్చులు పెరుగుతున్నాయి.

**మధ్యతరగతి చూపు టైర్-2 నగరాల వైపు**

మెట్రోలలోని మధ్యతరగతి కుటుంబాలు తమ ఆదాయంలో పొదుపు చేయలేకపోతున్నాయి. అంతర్జాతీయ విద్య, ఖరీదైన వైద్యం, బ్రాండెడ్ హౌసింగ్ వంటి ఆకాంక్షలు ఈ భారాన్ని మరింత పెంచుతున్నాయి. అందుకే, చాలామంది ఇప్పుడు తక్కువ అద్దెలు, మంచి మౌలిక వసతులు, పెరుగుతున్న ఉద్యోగావకాశాలు ఉన్న కోయంబత్తూరు, కొచ్చి, ఇండోర్ వంటి టైర్-2 నగరాల వైపు చూస్తున్నారు. ఈ నగరాలు మెట్రోల భారాన్ని తగ్గించి మెరుగైన జీవన ప్రమాణాలను అందిస్తున్నాయి.

# ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దన్నందుకు యువకుడు సూసైడ్

- బీటెక్ చేసి ఇంట్లోనే ఉంటూ సెల్‌ఫోన్‌లో ఆటలు...
- వద్దని మందలించిన తండ్రి...
- చిన్న కారణానికే ఎంత పనిచేశావ్ బ్రో...
- విషాదంలో మునిగిన కుటుంబం



**పీపుల్స్‌డైరీ-జగిత్యాల :** మధ్యలో చదువు మానేశాడు.. ఏదో ఒక్క పని చేసుకోవాలని నాలుగు మంచి ముచ్చట్లు చెప్పాడు తండ్రి..! అయితే, టైమ్ పాస్ కావడం లేదని ఆన్‌లైన్ గేమ్స్ అలవాటు పడ్డాడు.. మొత్తం సెల్‌ఫోన్‌కు అంకితం అయ్యాడు. ఆడవద్దని.. కొడుకుకు తండ్రి కొంచెం గట్టిగా చెప్పాడు. చిన్నపాటి కారణంతో బలవన్మరణానికి పాల్పడ్డ కొడుకు ఆ కుటుంబానికి కడుపుకోత మిగిల్చాడు. చేతికందిన కొడుకు మృతితో ఆ కుటుంబం తల్లడిల్లిపోయింది. జగిత్యాలలో ఓ యువకుడు ఆ గేమింగ్ మాయ బారిన పడి ప్రాణాలు కోల్పోయాడు. విద్యానగర్‌కు చెందిన రాహుల్.. బీటెక్ మధ్యలో మానేశాడు. కొంతకాలంగా ఇంట్లోనే ఉంటున్నాడు. ఎలాంటి పని లేకుండా ఖాళీగా ఉంటున్నాడు. సమయం గడపటానికి ఆన్‌లైన్ గేమ్స్ ఆడటం మొదలుపెట్టాడు. కానీ అది అలవాటై.. మత్తుగా మారింది. ప్రతిరోజూ ఫోన్‌లో గేమ్స్ ఆడుతుండటంతో తండ్రి శ్రీనివాస్ మందలించారు. ఏదైనా పని చేసుకోవాలని సూచించాడు.. ఇలాంటి గేమ్స్ ఆడవద్దని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు.

కానీ ఆ మందలింపు తో రాహుల్ తండ్రిపై కోపం పెంచుకున్నాడు. ఏదో ఒక్కటీ చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నాడు. ఇంట్లో ఎవరు లేని సమయం లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొడుకుని కోల్పోయిన తల్లిదండ్రులు విలపిస్తున్నారు. బుద్ధి మాట చెబితే.. ఇలా ఎందుకు చేసుకున్నవని రోదిస్తున్నారు. కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# విద్యారంగ అభివృద్ధికి సహకరించండి...

- యూకే విశ్వవిద్యాలయాల్లో మా విద్యార్థులకు అవకాశాలు విస్తరించండి
- తెలంగాణ ఉపాధ్యాయులకు, ప్రొఫెసర్లకు శిక్షణ కావాలి
- ఇతర రంగాల అభివృద్ధిలో కూడా ముందుకు రండి
- బ్రిటీష్ హైకమిషనర్‌ను కోరిన సీఎం రేవంత్‌రెడ్డి
- సానుకూలంగా స్పందించిన బ్రిటన్ అధికారి...



**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, భారత్‌లోని బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్‌ను కలుసుకున్నారు. ఈ భేటీలో విద్య, సాంకేతిక రంగాల్లో సహకారం, యూకే విశ్వవిద్యాలయాల్లో చదువుకునే విద్యార్థులకు అవకాశాలు విస్తరించేందుకు చర్చించారు. చెవెనింగ్ స్కాలర్‌షిప్‌ను కో-ఫండింగ్ విధానంలో తెలంగాణ మెరిట్ విద్యార్థులకు అందించేందుకు అంగీకారం వ్యక్తమైంది. ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు శిక్షణ ఇవ్వడంలో బ్రిటన్ సహకరించనున్నట్లు తెలిపారు. మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, జీసీసీ, ఫార్మా, నాలెడ్జ్ అకాడమీ వంటి రంగాల్లో పెట్టుబడులకు బ్రిటిష్ కంపెనీలు ముందుకు రావాలని సీఎం కోరగా, సానుకూల స్పందన లభించింది.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి మేరకు, విద్య, ఇతర రంగాల్లో సహకారం అందించడానికి బ్రిటిష్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. భారత బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరాన్ తాజాగా హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని కలుసుకుని ఈ విషయంపై చర్చించారు. ఈ సమావేశంలో కీలక అంశాలపై ఇరువురూ అంగీకారానికి వచ్చారు.

యూకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే చెవెనింగ్ అంతర్జాతీయ స్కాలర్‌షిప్ ప్రోగ్రాంలో తెలంగాణ విద్యార్థులకు కూడా అవకాశం కల్పించనున్నారు. కో-ఫండింగ్ ప్రాతిపదికన ఈ స్కాలర్‌షిప్‌లను మెరిట్ విద్యార్థులకు అందించడానికి బ్రిటిష్ హైకమిషనర్ అంగీకరించారు. ఈ స్కాలర్‌షిప్‌ల ద్వారా తెలంగాణ విద్యార్థులు యూకేలోని ప్రముఖ యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించవచ్చు. తెలంగాణలో కొత్తగా రూపొందించనున్న విద్యా విధానం గురించి కూడా ముఖ్యమంత్రి బ్రిటిష్ హైకమిషనర్‌కు వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్, పొలిటికల్ ఎకానమీ సలహాదారు నళిని రఘురామన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**మూసీ నది అభివృద్ధి..**

హైదరాబాద్‌లోని మూసీ నదిని పునరుద్ధరించే ప్రాజెక్టులో బ్రిటిష్ కంపెనీలు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. దీని పట్ల హైకమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఇది హైదరాబాద్ నగరాభివృద్ధికి ఒక ముఖ్యమైన ప్రాజెక్టుగా భావిస్తున్నారు.

తెలంగాణలో పెట్టుబడులకు అనువైన రంగాలను గుర్తించి, వాటిలో బ్రిటిష్ కంపెనీల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని సీఎం కోరారు. ముఖ్యంగా జీసీసీ (గల్ఫ్ కో-ఆపరేషన్ కౌన్సిల్), ఫార్మా, నాలెడ్జ్ సెంటర్లు, వివిధ అకాడమీల వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించాలని సూచించారు. హైదరాబాద్ ఫార్మాస్యూటికల్ పరిశ్రమకు ఒక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్నందున.. ఈ రంగంలో యూకే సహకారం మరింత కీలకంగా మారనుంది.

**ఇతర కీలక అంశాలు..**

అడ్మిషన్లు, సౌకర్యాలు.. యూకేలోని విశ్వవిద్యాలయాలు తెలంగాణ విద్యార్థుల కోసం అడ్మిషన్ల ప్రక్రియను హైదరాబాద్ నుంచే నిర్వహించాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు శిక్షణ అందించడానికి బ్రిటిష్ ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. ఈ సమావేశం తెలంగాణ, యూకే మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు.. విద్య, పెట్టుబడుల రంగాల్లో కొత్త అవకాశాలకు మార్గం సుగమం చేస్తుందని అధికారులు భావిస్తున్నారు.

# కవిత రాజీనామా ఆమోదంపై త్వరలో నిర్ణయం...

- పునరాలోచించుకోవాలని కవితకు సూచించా
- మండలి ఛైర్మన్ 'గుత్తా' కీలక వ్యాఖ్యలు



**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతోందని.. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఆమెను సస్పెండ్ చేయగా ఆ పార్టీ గుర్తుపై గెలిచిన పదవికి ఆమె రాజీనామా చేశారు. రాజీనామా లేఖను తెలంగాణ శాసనమండలికి కూడా పంపారు. అయితే ఆమె రాజీనామా చేసి ఇప్పటికే 15 రోజులు గడిచిపోయినా.. మండలి ఛైర్మన్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ నేపథ్యంలో కవిత రాజీనామా వ్యవహారంపై శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తాజాగా స్పందించారు. ఈ విషయంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన గుత్తా.. కవిత తన రాజీనామా లేఖను పంపిన తర్వాత ఫోన్ చేసి ఆమోదించాలని కోరారని తెలిపారు. అయితే, తాను ఆమెకు పునరాలోచించుకోవాలని సూచించానని అన్నారు. ఆ తర్వాత ఆమె నుంచి ఎలాంటి సమాచారం రాలేదని పేర్కొన్నారు.

ఇక తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవలే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన ఎమ్మెల్సీ కవితతో ముఖ్య నేతల భేటీలు హాట్ టాపిక్‌గా మారాయి. మూడ్రోజుల క్రితం జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పి.విష్ణువర్ధన్ రెడ్డి కూడా కవితతో భేటీ అయ్యారు. తాజాగా కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ కవితను కలిసినట్లు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. వీరిద్దరి మధ్య దాదాపు రెండు గంటల పాటు చర్చలు జరిగినట్లు సమాచారం. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమితులైన అమీర్ అలీ ఖాన్‌కు, బీఆర్ఎస్ పార్టీ కోర్టుకు వెళ్లడం వల్ల తన పదవి రద్దైంది. సుప్రీంకోర్టు తీర్పుతో ఆయనతో పాటు కోదండరాం ఎమ్మెల్సీ పదవులు కూడా రద్దయ్యాయి. తిరిగి కోదండరాం పేరును కేబినెట్ ఆమోదించినప్పటికీ.. అమీర్ అలీ ఖాన్‌కు మాత్రం అవకాశం ఇవ్వకుండా ఆయన స్థానంలో మాజీ ఎంపీ మహ్మద్ అజారుద్దీన్‌కు అవకాశం కల్పించింది. తన పదవి పోవడానికి బీఆర్ఎస్ కారణమైనా, తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం తనను పక్కన పెట్టడంపై అమీర్ అలీ ఖాన్ అసంతృప్తిగా ఉన్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆయన కవితతో భేటీ అయినట్లుగా ప్రచారం జరుగుతోంది.

# పండుగకు ప్రత్యేక బస్సులు...

(మొదటి పేజీ తరువాయి)

సొంతూళ్లకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముండటంతో ఆ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచనుంది. అలాగే, తిరుగు ప్రయాణానికి సంబంధించి అక్టోబర్ 5, 6వ తేదిల్లోనూ రద్దీకి అనుగుణంగా బస్సులను సంస్థ ఏర్పాటు చేయనుంది.

హైదరాబాద్‌లో ప్రధాన బస్టాండ్‌లైన ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్‌తో పాటు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే కేపీహెచ్‌బీ కాలనీ, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఉప్పల్ బస్టాండ్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్, తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడిపించనుంది. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రం నలుమూలలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు ఈ ప్రత్యేక బస్సులు నడుపుతోంది.

దసరా స్పెషల్ బస్సుల్లో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 16 ప్రకారం తిరుగు ప్రయాణంలో ఖాళీగా వచ్చే బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చుల మేరకు టికెట్ ధరలను సంస్థ సవరించనుంది. ఈ నెల 20తో పాటు 27 నుంచి 30 తేదివరకు వరకు, అలాగే అక్టోబర్ 1, 5, 6వ తేదిల్లో నడిచే స్పెషల్ బస్సుల్లోనే సవరణ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఆయా రోజుల్లో తిరిగే రెగ్యూలర్ సర్వీసుల చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. అవి యధావిధిగా ఉంటాయి.

"బతుకమ్మ, దసరా పండుగల దృష్ట్యా ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి సంస్థ సంసిద్ధంగా ఉంది. గత దసరా కంటే ఈ సారి అదనంగా 617 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాం. రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంప్ లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. ముఖ్యంగా ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, కేపీహెచ్‌బీ, సంతోష్ నగర్, తదితర ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం షామియానాలు, కూర్చీలు, తాగునీరు, తదితర మౌలిక సదుపాయాలతో పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను ఏర్పాటు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. ప్రతి రద్దీ ప్రాంతం వద్ద పర్యవేక్షణ అధికారులను నియమిస్తున్నాం. ప్రయాణికుల రద్దీని బట్టి వారు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచుతారు. పోలీస్, రవాణా, మున్సిపల్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా సంస్థ అన్ని చర్యలు తీసుకుంటోంది." అని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అన్నారు.

పండుగలకు రద్దీ ఎక్కువగా ఉందని వైట్ నంబర్ ప్లేట్ గల ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి.. ఇబ్బందులు పడొద్దని ఆయన సూచించారు. టీజీఎస్ఆర్టీసీలో ఎంతో అనుభవం గల డ్రైవర్లు ఉన్నారని, వారు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తారని చెప్పారు.

బతుకమ్మ, దసరా ప్రత్యేక సర్వీసుల్లో ముందస్తు రిజర్వేషన్ ను సంస్థ అధికారిక వెబ్ సైట్ tgsrtcbus.in లో చేసుకోవాలని కోరారు. దసరా స్పెషల్ సర్వీసులకు సంబంధించి పూర్తి సమాచారం కోసం టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని సూచించారు.



# ప్రపంచ వెదురు దినోత్సవ వేడుకల్లో మేదరి మహీంద్రా సంఘం

**సంగారెడ్డి జిల్లా మేదరి మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవ వేడుకలు**



**సంగారెడ్డి /సెప్టెంబర్ 18: (పీపుల్స్ డైరీ) :** సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగిన ప్రపంచ వెదురు దినోత్సవం ఆకట్టుకున్న వెదురు ఉత్పత్తుల ప్రదర్శన పాల్గొన్న మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ బి. విజయ బి సి సంఘం నేతలు. సంగారెడ్డి జిల్లా కేంద్రం లో మేదరి మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా వెదురు ఉత్పత్తుల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమం లో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ,వెదురు మీద ఆధారపడి జీవిస్తున్న మేదరి కుల వృత్తి దారులకు,ప్రభుత్వాలు మరిన్ని సంక్షేమ పథకాలు పెట్టి వెదురు వృత్తి ని ప్రోత్సహించలని అన్నారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ బొంగుల విజయ లక్ష్మి రవి మాట్లాడుతూ,మెదరులు ఐక్యంగా ఉండి,సంఘం సమస్యలు పరిష్కారం కొరకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం. అధ్యక్షులు చిద్రుప్పా ప్రభుగౌడ్, బహుజన నాయకులు మల్లయ్య,రజక సంఘాల సమితి అధ్యక్షులు నామాల నాగేష్,బిసి సంక్షేమ సంఘం నాయకులు మల్లికార్జున్ పాటిల్, ఫోరమ్ ప్రధాన కార్యదర్శి మహేష్ కుమార్ లు పాల్గొన్నారు. అనంతరం మేదరి మహేంద్ర సంఘం జిల్లా కమిటీ అధ్యక్షులు అంబాదాస్ ఆధ్వర్యంలో, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మేదరి మహేంద్ర సంఘం డిమాండ్ లతో కూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేదరి మహేంద్ర సంఘం కోసం, ఆర్డినేటర్ కుమార్ మహేంద్ర, మేదరి మహేంద్ర సంఘం జిల్లా అధ్యక్షులు నందికంటి నరసింహులు,ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు తోకల శ్రీశైలం,, వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మహేంద్ర,కోశాధికారి రాజు, ప్రచార కార్యదర్శి లక్ష్మి నారాయణ మహేంద్ర, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు,యువత అధ్యక్షులు శేఖర్,శ్రీనివాస్ నాయకులు ప్రమోద్, అనిల్,రాంచందర్ , ముత్తైకోట రాములు, ప్రవీణ్ ,శ్రీశైలం,శంకర్, లక్ష్మణ్ హన్మాండ్ల బాలరాజ్,పులి మల్లయ్య,గోపి,శ్రీనివాస్, బిక్షపతి,ఈశ్వర్,మల్లేష్ ప్రకాష్,యాదగిరి,నర్సింలు, ఓం ప్రకాష్,మహిళా నాయకులు సరిత, విజయ,మంగమ్మ,శ్రీలత, సంతోషి,లక్ష్మి,రజని, మమత,దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు

# మెదడును మేస్తుంది....

(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యాధి కారణంగా ఇప్పటివరకు 19 మంది ప్రాణాలు కోల్పోయారు. తాజాగా మరో మూడు కేసులు నమోదయ్యాయి.

ఈ వ్యాధి చిన్నా పెద్దా అని తేడా లేకుండా అందరిలోనూ బయటపడుతోంది. తాజాగా నమోదైన కేసుల్లో మూడు నెలల శిశువుతోపాటుగా 52 ఏళ్ల మహిళ కూడా ఉన్నారు. అయితే ఇది అంటు వ్యాధి కాదని వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదం లేదని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లోని అపరిశుభ్రమైన చెరువులు, కుంటలు, సరస్సులు వద్ద స్నానం చేస్తే.. ఈ అమీబా ముక్కు ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తుంది. అలా మెదడును తినేస్తుంది. ఈ అంశంపై కేరళ హెల్త్ మినిస్టర్ వీణా జార్జ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కేరళ ఆరోగ్యపరమైన సవాళ్లను ఎదుర్కొంటోందని తెలిపారు. ఇంతకుముందు కోజికోజ్, మలప్పురం జిల్లాలకే పరిమితమైన ఈ వ్యాధి ఇప్పుడు రాష్ట్రమంతటా వ్యాప్తి చెందడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మూడు నెలల చిన్నారుల నుంచి 91 ఏళ్ల వృద్ధులు ఈ వ్యాధి బారిన పడిన వాళ్లలో ఉన్నట్లు తెలిపారు. అమోబిక్ మెనింజోఎన్సెఫలైటిస్ (పామ్) లక్షణాలు చూస్తే తలనొప్పి, జ్వరం, వాంతులు, ఒళ్లు నొప్పులు, వికారం సాధారణ ఫ్లూ లక్షణాలే కనిపిస్తాయి. సమయం గడుస్తున్న కొద్దీ మెడ బిగుసుకుపోవడం, ఫిట్స్ రావడం, కోమాలోకి వెళ్లడం జరుగుతుందని వైద్యులు తెలిపారు. ఇదంతా ఒక వారం రోజుల వ్యవధిలోనే జరుగుతుంది. వారంలోగా ఈ వ్యాధి బారిన పడిన బాధితులు మృతి చెందే అవకాశం ఉంది. అమోబిక్ మెనింజోఎన్సెఫలైటిస్ (పామ్) 2016 లో కేరళలో తొలి కేసు నమోదైంది. ఆ తర్వాత 2023 వరకు కేవలం 8 కేసులు మాత్రమే బయటపడ్డాయి. కానీ గతేడాది మాత్రం ఏకంగా 36 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటికే 69 కేసులు నమోదయ్యాయి. 19 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇది 100 శాతం కేసుల పెరుగుదలగా వైద్యులు చెబుతున్నారు.

# తెలంగాణలో యూరియా కొరతను నివారించాలి

**దమ్మపేట, సెప్టెంబర్18( పీపుల్స్ డైరీ)**

రాష్ట్రంలో రైతులకు అవసరమైనంత యూరియాని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయాలని, అమెరికా, భారత్ పరస్పర వాణిజ్య ఒప్పందాల్లో భాగంగా పత్తిపై ఎత్తివేసిన 11% సుఖాన్ని భారత్ ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని, పత్తి పంటకు కనీస మద్దతు ధర 10,075 రూపాయలుగా నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, అఖిలభారత ఐక్యత సంఘం ఏ యు కె ఎస్ దమ్మపేట మండల కమిటీ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసిల్దార్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగిం ది ఈ ధర్నా కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం ఏఐయుకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి తీర్చాలని, రైతు పంటలకు స్వామినాథన్ సిఫారసుల ప్రకారం వ్యవసాయ ఉత్పత్తులకు సమగ్ర ఖర్చుల ప్రాతిపదికన కనీస మద్దతు ధరలను అన్ని పంటలకు నిర్ణయించాలని వాటిని ప్రభుత్వ కొనుగోలు చేయాలని అన్నారు అలాగే గత బిఆర్ఎస్ ప్రభుత్వం లాగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నో సంవత్సరాలుగా పోడు భూములు సాగు చేసుకుంటున్నా రైతుల పంటలను అటవీ అధికారుల చేత పంటలను ధ్వంసం చేయిస్తున్నారని దీని మూలంగా గత బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వంనికి పడుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో గత కొంతకాలంగా రైతులకు యూరియా కొరత తో రైతులు రాత్రి పగలు తేడా లేకుండా సహకార కార్యాలయాల ముందు పడ కాపులు కాస్తూ సహకార సంఘాలు దగ్గర నిద్రిస్తున్న యూరియా దొరకటం లేదని అన్నారు. ఈ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం మూలంగా దేశంలో అన్నదాతలు హరి గోస కొడుతున్నారని అన్నారు రైతులకు వెంటనే యూరియా అందించాలి, భారత ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందంలో భాగంగా పత్తిపై వ్యక్తి వేసిన 11 శాతం సుఖాన్ని పునరుద్ధరించాలని అన్నారు ప్రకృతి వైపరీత్యాలు అతివృష్టి వరదల వలన పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీల ప్రకారం వృద్ధాప్య పింఛన్ ని కొరకు దరఖాస్తు చేసుకున్న మంజూరు చేయడం లేదు రాష్ట్ర ప్రభుత్వం 19 నెలలు గడుస్తున్న ఇప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడమా వృద్ధుల పింఛను 4000 రూపాయలు వికలాంగుల పింఛను 6000 రూపాయలు మంజూరు చేస్తానన్న హామీని ఇప్పటికీ అమలు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు ఎప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైత సంఘం పాల్వంచ డివిజన్ అధ్యక్షుడు బండారి వీరబాబు, డివిజన్ నాయకులు వగ్గేల ప్రసాద్, మండల అధ్యక్షులు కుంజా కాంతారావు తామ రాముడు, కుంజ పాపారావు బండి ఆదినారాయణ, చాప ముత్యాలరావు, కేసరి వెంకటేష్, గంగాధర నాగమణి, తెల్లం నాగేష్,తదితరులు పాల్గొన్నారు .

- **రాష్ట్రంలో రైతాంగానికి అవసరమైన యూరియా వెంటనే అందించాలి**
- **పోడు భూముల్లో ఫారెస్ట్ అధికారులు పంటల ధ్వంసం చేయటాన్ని ఖండించండి**
- **అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము**







# పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి : కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) : భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయంలో గురువారం బతుకమ్మ దసరా పండుగల ఏర్పాట్లు పారిశుధ్య కార్యక్రమాలు ఇంటింటి నుండి వ్యర్థాల సేకరణ స్వచ్ఛ వాహనాలను జిపిఎస్ ట్రాక్టర్ ద్వారా పర్యవేక్షణ సిబ్బంది సమయపాలన ఖాళీ ఇంటి స్థలాలను పరిశుభ్రంగా ఉంచడం, వన మహోత్సవంలో ప్రతి ఇంటికి 6 మొక్కల పంపిణీ ప్రధాన రహదారి డివైడర్ లో మొక్కల సంరక్షణ వ్యర్థాల నుండి వర్మీ తయారు చిన్నారుల పార్కు తదితర అంశాలపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రమం తప్పక ప్రతి ఇంటి నుండి వ్యర్థాల సేకరణ జరగాలని వార్డు అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక ఫోకస్ చేయాలని సూచించారు. వార్డు అధికారులు నిత్యం వార్డుల్లో పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

రీసైక్లింగ్ వస్తువులు విక్రయాలు తడి చెత్తను వర్మీ తయారు చేసి మొక్కలకు వినియోగించడం విక్రయాల ద్వారా ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



డివైడర్‌లో నాటిన మొక్కలు వంగిపోకుండా సపోర్ట్ గా కర్రలు పెట్టాలన్నారు. వన మహోత్సవంలో ప్రతి ఇంటికి 6 మొక్కలు పంపిణీ చేయాలని పంపిణీ వివరాలు రిజిస్టర్ లో నమోద్ చేయాలని తెలిపారు. ఖాళీగానున్న ఇంటి స్థలాలు పరిశుభ్రం చేయాల్సిన బాధ్యత స్థల యజమానులదేనని అలాంటి స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని నిర్దేశించిన సమయంలో పరిశుభ్రం చేయకపోతే మున్సిపాలిటీ నుండి పరిశుభ్రం చేపించి జరిమానా విధించాలని స్పష్టం చేశారు. దుకాణాల ముందు వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని వ్యర్థాలు వేస్తే జరిమానా విధించాలని తెలిపారు. మాంసాహార దుకాణాల నుండి వ్యర్థాలు ఆరుబయట వేయకుండా అవగాహన కల్పించాలని రహదారుల వెంబడి ఆరుబయట వేస్తే జరిమానా విధించాలని ఆదేశించారు. వ్యర్థాలు వేస్తున్న ప్రాంతాలను గుర్తించి వ్యర్థాలు వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించకుండా అవగహన కొరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లు నూరు శాతం జరగాలని తెలిపారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ పరిధిలో చిన్నారుల కోసం పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియం ఆడిటోరియం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు ఇవ్వాలని ఆదేశించారు. బతుకమ్మ దసరా ఉత్సవాలకు వార్డుల వారీగా సక్రమమైన ఏర్పాట్లు చేయాలని వార్డు అధికారులను ఆదేశించారు. ఈ నెల 21నుండి ప్రారంభం కానున్న బతుకమ్మ సంబరాల్లో మహిళలు బతుకమ్మలు ఆడే ప్రాంతాలను గుర్తించి పారిశుద్ధ్య కార్యక్రమాలు విద్యుత్ సౌకార్యం కల్పించాలని సూచించారు. బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా ఘాట్ వద్ద ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. 30న జరిగే సద్దుల బతుకమ్మఅక్టోబర్ 2న జరిగే దసరా వేడుకలకు పెద్ద ఎత్తున ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఏఈ మానస డిపిఓ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ నీటి పర్యవేక్షణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సొంటిరెడ్డి పున్నారెడ్డి

**కుత్బుల్లాపూర్,సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** ప్రపంచ నీటి పర్యవేక్షణ దినోత్సవంను సందర్భంగా ఎస్పీఆర్ ట్రస్ట్ చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 18న ఈ దినోత్సవాన్ని నిర్వహించడం వెనుక ముఖ్య ఉద్దేశ్యం... మనం వాడుతున్న నీరు స్వచ్ఛంగా ఉందా? సురక్షితంగా ఉందా? అన్నది గుర్తించడం. మన జీవనానికి నీరు అమూల్యం.నదులు, సరస్సులు,చెరువులు, బోర్లు వంటి వనరులలోని నీటి నాణ్యతను పరీక్షించడం ద్వారా భవిష్యత్‌లో కలుషిత నీటివల్ల కలిగే వ్యాధులను నివారించవచ్చు. ప్రపంచ నీటి పర్యవేక్షణ దినోత్సవం మనకు ఒక గొప్ప సందేశాన్ని ఇస్తుంది.ప్రతి చుక్క నీరు విలువైనది, దాన్ని సంరక్షించడం మనందరి బాధ్యత.అందరం నీటిని వృథా చేయకుండా, పరిశుభ్రంగా ఉంచి,రాబోయే తరాలకు అందేలా కృషి చేద్దాం అని సొంటిరెడ్డి పున్నారెడ్డి పిలుపునిచ్చారు.

# మునీరాబాద్‌లో పర్యటించిన మున్సిపల్ కమిషనర్

**మేడ్చల్ సెప్టెంబర్ 18(పీపుల్స్ డైరీ) :** గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని మునీరాబాద్ గ్రామంలోని అఖిల లపక్ష నాయకులు సహకరిస్తే మునీరాబాద్ ను మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతానని గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రజా పాలన దినోత్సవ సందర్భంగా మునీరాబాద్ తాజా మాజీ సర్పంచ్ గణేష్ నేత చిట్టిమిల్ల, మాజీ ఉపసర్పంచ్ నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బలరాంరెడ్డిలు కమిషనర్ తో ప్రత్యేకంగా సమావేశమై మునీరాబాద్ గ్రామపంచాయతీ గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీలో విలీనమైన తరువాత అనేక సమస్యలకు నెలవుగా మారిందని, వాటిని పరిష్కరించాలని కోరారు. వెంటనే స్పందించిన మున్సిపల్ కమిషనర్ గురువారం ఉదయం మార్నింగ్ వాక్ కు వచ్చి మాజీ సర్పంచులు, అఖిలపక్ష నాయకులతో కలిసి గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. మునీరాబాద్ గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ఒక వెలుగు వెలిగిన వైకుంఠధామం, డంపింగ్ యార్డ్, పార్క్, నర్సరీ, క్రీడా ప్రాంగణాలు గత సంవత్సర కాలంగా పట్టించుకునే వారు లేక నిర్లక్ష్యానికి గురవుతున్నాయని వాటిని పునరుద్ధరించి ప్రజా ఉపయోగంలోకి తీసుకురావాలని నాయకులు కమిషనర్ ని కోరారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాలనీ అంతర్గత భూగర్భ మోరీల అవుట్ లెట్ ను జనావాసాలకు దూరంగా మార్చాలని, వైకుంఠధామం చుట్టూరా ప్రహరి గోడ నిర్మించాలని, పార్కులోని రోడ్లను, క్రీడా ప్రాంగణాన్ని శుభ్రపరచాలని, వాటి పర్యవేక్షణ కొరకు ఒక వ్యక్తిని నియమించాలని అఖిల పక్ష నాయకులు కోరారు. సానుకూలంగా స్పందించిన మున్సిపల్ కమిషనర్ వీలైనంత తొందరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అఖిల పక్ష నాయకులు గ్రామ అభివృద్ధి కొరకు పార్టీలకతీతంగా సమిష్టిగా ఉండడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కైరంకొండ గణేష్, గూడూరు శ్రీనాథ్ రెడ్డిలు, మాజీ వార్డు సభ్యులు నాగరాజు రెడ్డి నరేందర్లు, డి ఈ దుర్గా ప్రసాద్, మేనేజర్ శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్,వార్డ్ ఆఫీసర్ అశ్వంత్, మధు, మహేష్, రామకృష్ణారెడ్డి, బిక్షపతి,భాస్కర్ రెడ్డి మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం

**సీనియర్ కాంగ్రెస్ నాయకులు,రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్**

భీమదేవరపల్లి సెప్టెంబర్ 18 ( పీపుల్స్ డైరీ) : క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్ అన్నారు. భీమదేవరపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రీడ పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "క్రీడల్లో గెలుపు–ఓటములు సహజం. క్రీడలు శారీరకంగా, మానసికంగా దోహదం చేస్తాయి. ఆటలో మాత్రమే కాకుండా జీవితంలో కూడా సత్తా చాటాలి" అని క్రీడాకారులను ప్రోత్సహించారు. అలాగే మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనబోతున్న సందర్భంగా వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేకత ఏమిటంటే – మండల స్థాయి క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులలో కొత్త ఉత్సాహం నింపడానికి స్వయంగా బహుమతులు తీసుకువచ్చి, విజేతలకు వెంకటనారాయణ గౌడ్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సునీత, ముల్కనూర్ సబ్ ఇన్స్పెక్టర్ ఎం.రాజు , భీమదేవరపల్లి ఇన్‌ఛార్జి హెడ్‌మాస్టర్ ప్రదీప్ కుమార్ , యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ పోగుల శ్రీకాంత్, వివిధ గ్రామాల పీడీలు,పీఈటిలు పాల్గొన్నారు.




# చిన్నారిని ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



**చిట్యాల, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని కాల్వపల్లి గ్రామ వాస్తవ్యులు మోరె సురేష్ – జ్యోత్స్న దంపతుల కుమార్తె మధు వర్షిణి నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గురువారం పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. వారి వెంట చిట్యాల మాజీ జెడ్పిటిసి గొర్రె సాగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కూర మహిపాల్ రెడ్డి సీనియర్ నాయకులు సాధన మల్లయ్య బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# 50 ఏండ్ల పింఛన్‌కై మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేయాలి



**చిట్యాల, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** చేయూత పథకం కింద వృద్ధులు వికలాంగులు వితంతువులు చేనేత కార్మికులు గీతా కార్మికులు బీడీ కార్మికులు హెచ్ఐవి ఎయిడ్స్ ఉన్నవారు లబ్ధి పొందుతున్నారు. ఈ క్రమంలో కొన్ని కులవృత్తుల వారికి 50 ఏండ్లకే చేయూత పింఛన్ వస్తుందని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన వారికి కూడా 50 ఏండ్లకే చేయూత పింఛన్లు అందించాలని దీనికోసం సమగ్రంగా చర్చించడానికి మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి చర్చించడానికి మార్గదర్శకాలు రూపొందించాలని ఎమ్మార్పీఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా సీనియర్ నాయకులు రాం రామ్ చందర్ మాదిగ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ సామాజిక భద్రతా పింఛన్లు పొందడానికి ప్రస్తుతం ఉన్న 57 సంవత్సరాల వయసును రద్దు చేసి 50 ఏండ్లు నిండగానే వారికి చేయూత పింఛన్లు మంజూరు చేసి ఆర్థికంగా కనీస అవసరాలు తీర్చే విధంగా ప్రభుత్వం సహాయం చేయాలన్నారు. 50 ఏండ్లు దాటగానే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అన్ని వర్గాల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితుల కారణంగా సాధారణ ప్రజలు కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితిలో ఉంటున్నారని దీన్ని పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న 57 ఏండ్ల వయసును రద్దుచేసి 50 ఏండ్లకే పింఛన్ మంజూరు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న కల్తీ ఆహార పదార్థాల వలన ప్రజలు 50 ఏళ్లకే వృద్ధాప్య లక్షణాలకు గురవుతున్నారని అదేవిధంగా గ్రామాల్లో చదువుకొని ఉద్యోగాలు రాక నిరుద్యోగంతో బాధపడుతున్న వారు కూడా ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని వారిని కూడా ఆదుకునే దిశలో 50 ఏళ్లకే చేయూత పింఛన్ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కొన్ని కుల వృత్తుల వారికి 50 ఏళ్లకే పింఛన్లు మంజూరు చేసి ఇంకొన్ని కులాల వారిపట్ల ప్రభుత్వాలు వివక్ష చూపించడం సరైనది కాదు అన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన మహోత్సవం

**చిన్నారులను అభినందించిన ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి**






**వరంగల్ సెప్టెంబర్ 18 (పీపుల్స్‌డైరీ) :** వరంగల్ నగరంలోని నాని గార్డెన్ లో గురువారం రోజున బెస్ట్ టీచర్స్ అవార్డు గ్రహీతలకు సన్మాన మహోత్సవం తెలంగాణ రికగ్నైజ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అన్ని వృత్తులలో కెల్లా పుత్యేకమైనది. దేశ భవిష్యత్తు తరగతి గదులలో రూపుదిద్దుకుంటుంది. ప్రపంచ దేశాలలో అత్యంత అభివృద్ధి చెందేందుకు ప్రామాణికం విద్య అని నేటి పరిశోదనలు తెలుపుతున్నారు. ఎంతో సృజనాత్మకంగా విద్యార్థులలో దాగి ఉన్న. సామర్థ్యాలను గుర్తించి, మంచి ప్రయోజకులుగా మార్చే గురుతర బాధ్యత మన పైన ఉందని టెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మంచి సాంప్రదాయాన్ని కొన్నవారిస్తున్న ఈ తెలంగాణ రికగ్నైజ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ నిర్వహణ కమిటిని అభినందించారు. చిన్నారులు చేసిన కూచిపూడి నృత్యములను తిలకించి అనంతరం చిన్నారి పసుపులేటి కాత్యాయని మెమెంటో అందించి చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులుగా నాగార్జున రెడ్డి వ్యవహరించారు. రాష్ట్ర అధ్యక్షులు మధుసూదన్, జనరల్ సెక్రెటరీ రమేష్, వడుప్సా రాష్ట్ర అధ్యక్షులు భూపాల్ రావు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# బతుకమ్మ సందడితో నూతన విద్యార్థులకు స్వాగతం

ఆర్మూర్,సెప్టెంబర్,18(పీపుల్స్ డైరీ) తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఆర్మూర్ నందు గురువారం నూతన, బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. నూతన విద్యార్థులకు ఆహ్వానంగా సీనియర్ విద్యార్థులు సందడి చేస్తూ ఆట పాటలతో అలరించారు. ఇదిలా ఉండగా తెలంగాణ లో దసరా సెలవులకు ముందుగా విద్యార్థుల కోసం బతుకమ్మ వేడుకను జరిపి అధ్యాపక బృందం కూడా వారితో మమేకమై చప్పట్లతో బతుకమ్మ ను ఆడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా . ఎస్.చంద్రిక మాట్లాడుతూ నూతన విద్యార్థులకు భవిష్యత్ విద్యా సంబంధ ప్రణాళికను, సూచనలను తెలియజేస్తూ ఉన్నతంగా ఎదగాలని కాంక్షించారు. అలాగే బతుకమ్మను ఈ రోజు జరుపుకోవటం సంతోషాన్నిచ్చింది అన్నారు. విద్యార్థులు ఆట పాటలతో రెండు వేడుకలను ఆస్వాదించారంటూ చెప్పుకొచ్చారు.

## స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్‌కు తిరుగులేదు : రవీందర్‌గౌడ్



**ఆత్మకూర్, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని, కాంగ్రెస్ ప్రభుత్వంపై టిఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాలు మానుకోవా లని ఆత్మకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేయడం మానుకోవాలని గత పది సంవత్స రాల నుండి బిఆర్ఎస్ నాయకులు రాష్ట్రాన్ని దోచుకున్నారని అప్పుల పాలు చేశారని వారిని ప్రజలు తరిమి కొట్టిన ఇంకా బుద్ధి రాలేదనని, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రస్తుత ఎమ్మెల్యేపై అసత్య ప్రకటనలు మానుకోవాలని హితవు పలికారు. రాబోయే స్థానిక ఎలక్షన్లో గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని ఆయన తెలిపారు.

## అంత్యక్రియల్లో పాల్గొన్న తక్కళ్ళపల్లి రాజు



**మొగుళ్లపల్లి, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** మండలంలో ఇస్సిపేట గ్రామానికి చెందిన ఊరుగొండ రాజేందర్ అనారోగ్యంతో గురువారం ఉదయం మృతిచెందారు. విషయం తెలిసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తక్కళ్లపల్లి రాజు (రాజేశ్వర్ రావు) మృతుని పార్థివ దేహాన్ని సందర్శించి అంత్యక్రియల్లో పాల్గొని ఊరుగొండ రాజేందర్ ఆత్మకు శాంతిః చేకూరాలని పాడే మోసి కన్నీటితో వీడ్కోలు పలికారు. మృతిని కుటుంబానికి ఆ భగవంతుడు అన్ని విధాలుగా ఆదుకోవాలని వేడుకున్న తక్కళ్ళపల్లి రాజు ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.

## జాతీయ మానవ హక్కుల కమిటీ మండలాధ్యక్షుడిగా రాజేష్



**ఆత్మకూరు, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** జాతీయ మానవ హక్కుల కమిటీ ఆత్మకూర్ మండల అధ్యక్షుడిగా రాజేష్ ను, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల గణేష్ ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాజేష్ మాట్లాడుతూ మండలంలో మానవ హక్కులకు భంగం కలగకుండా చూస్తానని అన్నారు. నాపై నమ్మకంతో నా నియామకానికి సహకరించిన హన్మకొండ జిల్లా అధ్యక్షులు బండి సదానందం , జిల్లా ప్రధాన కార్య దర్శి మహేష్ ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శ్రీకాంత్, విసంపెల్లి నగేష్, నెహ్రూ నాయక్, గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షులు కోమండ్ల శ్రీనివాస్, వరంగల్ జిల్లా అధ్యక్షులు మెరుగు రాంబాబు, ప్రధాన కార్యదర్శి సంగం రమేష్, పరకాల మండల అధ్యక్షుడు రత్న ప్రశాంత్, ప్రధానకార్యదర్శి పల్లెబోయిన రాజు, దామెర అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా చర్యలు చేపట్టాలి!

### కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**మట్టెవాడ, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా చర్యలు చేపట్టాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. బల్దియా పరిధిలోని 31వ డివిజన్ శాయంపేటలో గురువారం కమిషనర్ క్షేత్ర స్థాయిలో శానిటేషన్ నీటి సరఫరా పరిశీలనలలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డివిజన్‌లలో చెత్త వాహనాలు వారికి కేటాయించిన ప్రాంతంలో గృహాల నుండి చెత్తను సేకరించాలని ఖాళీ ప్రాంతాలలో చేత్త వేయకుండా నివారించాలని సమయపాలన పాటిస్తూ చెత్త సేకరణ జరపాలని చెత్త సేకరణ క్రమంలో సంబంధిత యాజమాన్యాల సంతకాలు తీసుకోవాలని ఆదేశించిన కమిషనర్ శానిటేషన్ సిబ్బంది రోజు చెత్త సేకరణ చేస్తున్నారా? అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ రవి కుమార్, ఏఈ సౌజన్య, శానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెలను ఎత్తుకెళ్లిన దొంగలు

**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన కంచర్ల రాజేందర్ భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామ శివారులోని తన వ్యవసాయ భూమి వద్ద ఉన్న కోళ్ల షెడ్డులో కోళ్లు,గొర్రెలను పెంచుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కోళ్ల షెడ్డు ఫెన్సింగ్ ను తొలగించి 9 గొర్రెలను ఎత్తుకెళ్లారు. బాధితుడు రాజేందర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం

### బీజేపీ నేతలు గంట రవికుమార్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

**మట్టెవాడ, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ):** భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ‘సేవాపక్షం’ కార్యక్రమాలలో భాగంగా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు గురువారం వరంగల్ 35వ డివిజన్ పరిధిలో శివనగర్ మండల ప్రధాన కార్యదర్శి వైట్ల గణేష్ ఆధ్వర్యంలో పుప్పాలగుట్ట ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసర ప్రాంతాలలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొని బీజేపీ నాయకులతో కలిసి వారు చీపురు పట్టి రోడ్లను శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని గంట , ఎర్రబెల్లి సూచించారు. ప్రధాని మోడీ దేశ ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ ప్రతి రంగంలో అపూర్వ మైన మార్పులు తీసుకొచ్చారన్నారు. స్వచ్ఛ భారత్, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ఆయుష్మాన్ భారత్, మేక్ ఇన్ ఇండియా వంటి పథకాల ద్వారా భారతదేశాన్ని ప్రపంచంలో ముందంజలో నిలిపారనీ వారు కొనియాడారు. ఆయన నాయకత్వంలో దేశం సాధించిన విజయాలు ప్రతి భారతీయుడికి గర్వకారణం. మేము కూడా మోడీ ఆశయాలను అనుసరించి ప్రజాసేవలో కొనసాగుతామని గంట, ఎర్రబెల్లి తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాపక్షం జిల్లా కన్వీనర్ కనుకుంట్ల రంజిత్ కుమార్, కో కన్వీనర్లు కర్నే రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు కందిమల్ల మహేష్, మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, సేవాపక్షం మండల కన్వీనర్ సాగరిక, బండి సుజాత, జిల్లా నాయకులు సిద్ధం నరేష్, అంకాల జనార్ధన్, బిజెపి నాయకులు సుర శ్రీనివాస్, పిట్టల వెంకన్న, నవీన్, కోమాకుల నాగరాజు, రాజు, కోట సతీష్, చందా రాజు, సురేష్, శ్రీకాంత్, మధు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్య విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

### ఆవోపా అధ్యక్షుడు దొంతుల ఈశ్వరయ్య



**మట్టెవాడ, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** ఆవోపా హనుమకొండ ఆధ్వర్యంలో 2024 -25 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రతిభావంతులైన ఆర్యవైశ్య విద్యార్థిని విద్యార్థులకు బంగారు పతకాలను ప్రదానం చేయనున్నట్లు ఆవోపా హనుమకొండ అధ్యక్షులు దొంతుల ఈశ్వరయ్య ప్రకటించారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఆవోపా భవనంలో బంగారు పతకాలు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. 2024 -25 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు 10వ తరగతి నుండి పీజీ, పీహెచ్.డి వరకు ఉన్న అన్ని కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన వివరించారు. ఒక్కొక్క కోర్సులలో మాకు అందిన దరఖాస్తులలో అత్యధిక మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేయడం జరుగుతుందని ఈశ్వరయ్య వెల్లడించారు. ఆసక్తిగల విద్యార్థిని విద్యార్థులు హనుమకొండ సుబేదారిలోని ఆవోపా కార్యాలయంలో ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తుతో పాటు విద్యార్థి మార్కుల జాబితా/ర్యాంక్ కార్డు, ఫోటో, ఆధార్ కార్డు జతచేసి సమర్పించాలని ఈశ్వరయ్య సూచించారు. ఇతర వివరాల కొరకు 7093035699 సెల్ నెంబర్ లో సంప్రదించాలని వారు కోరారు. సమావేశంలో కార్యదర్శి కమటాల భాస్కర్ రావు, కోశాధికారి డాక్టర్ గంపా సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ గన్ను సురేందర్, పీఆర్ఓ పబ్బతి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై ఇసుక లారీలను నిలపవద్దు



**నూగురు వెంకటాపురం, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ)** :వెంకటాపురం - చర్ల ప్రధాన రహదారిపైనే ఇసుక లారీలను నిలపడం కారణంగా ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందు లను ఎదుర్కొంటున్నారని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గ్యానం వాసు అన్నారు. గురువారం ఆ పార్టీ శ్రేణులు ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ.. ఇసుక లారీల వల్ల రోడ్లు పూర్తిగా ధ్వంసం అవడంతో ఏజెన్సీ ప్రజలకు ఆర్టీసీ బస్సులు సక్రమంగా అందడం లేదన్నారు. ఈ సమస్య చాలదన్నట్లు రోడ్లపై లారీలలో ఇసుక లోడింగ్ నిర్వహించడం కారణంగా ప్రతి రోజూ ట్రాఫిక్ సమస్యలను ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు, తీవ్రంగా ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇసుక లారీల వల్ల 30 కిలోమీటర్ల ప్రయాణం మూడు, నాలుగు గంటల సమయం పడుతుందని ఆరోపించారు. విషయం తెలుసుకున్న వెంకటాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ముత్యం రమేష్ సంఘటన స్థలానికి చేరుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన కార్యక్రమాన్ని విరమించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు కుమ్మరి శ్రీను, కట్ల నరసింహాచారి, కోగిల మాణిక్యం, గొంది రమణయ్య, కోగిల ముతేష్, సంజీవ, కుర్సం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల ఆకస్మిక దాడి

### 11 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్



**మొగుళ్ళపల్లి, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** మండలంలో పేకాట స్థావరాలపై ఆకస్మికంగా దాడి చేసి పేకాట రాయులను అరెస్టు చేసినట్లు మొగుళ్ళ పల్లి ఎస్ఐ బొ రగల అశోక్ తెలిపారు. ఎస్సై అందించిన సమాచారం మేరకు. మొగుళ్ళ పల్లి పోలీస్ స్టేషన్ పరిధ్ లోని పర్లపల్లి గ్రామ శివారు లోని నిర్మానుష్యమైన ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరం పై దాడి చేసి, పేకాట ఆడుతున్న పదకొండు జూదరులని అదుపులోకి తీసుకోవడం జరిగిందని. పేకాటరాయుల వద్ద నుండి 28,410 రూపాయల నగదు, 8 ద్విచక్ర వాహనాలను. పేక ముక్కలు స్వాధీనం చేసుకోవడం జరిగింది. పట్టుబడిన వారిని తదుపరి విచారణ నిమిత్తం మొగుళ్ళ పల్లి పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.



## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

### మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

**ఆత్మకూర్, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని కటాక్షపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు శిరంశెట్టి సుమన్ తండ్రి నరసింహరాములు ఇటీవల మరణించగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి గురువారం సందర్శించి నరసింహ రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని భరోసా కల్పించాలి. ఆయన వెంట బిఆర్ఎస్ దామెర మండల అధ్యక్షుడు గందు రాము, ఆత్మకూరు మండల ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, మాజీ వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, గూడెప్పాడు ఏఎంసి మాజీ చైర్మన్ కాంతల కేశవరెడ్డి, మాజీ సర్పంచులు యాదగిరి, కమలా రాజేశ్వరరావు, బిఆర్ఎస్ నాయకులు, యూత్ నాయకులు ఉన్నారు.

## మెగా రక్తదాన శిబిరం



**గణపురం, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదిన వేడుకలను బిజెపి మండల అధ్యక్షుడు ఊర నవీన్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి ఊర నవీన్ రావు కేక్ కట్ చేయగా, యువత, మహిళలు మోదీకి శుభాకాంక్షలు తెలుపుతూ నినాదాలతో మార్మోగించారు. గ్రామ పెద్దలు మోదీ పాలనలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావించి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు, వివిధ గ్రామాల కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## ఆరోగ్యశ్రీ సేవలను వెంటనే పునరుద్ధరించాలి

### బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న



**ఏటూరునాగారం, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రాణాలపై నిర్లక్ష్యం వహిస్తోందని బి ఆర్ఎస్ జిల్లా నాయకుడు భూక్య జంపన్న తీవ్రస్థాయిలో విమర్శించారు. సందర్భంగా భూక్య జంపన్న మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడంతో పేదలు, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశా రు. అత్యవసర శస్త్రచికిత్సలు వాయిదా పడుతున్నాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులు డబ్బుల కోసం తల్లడిల్లుతున్నారు. ఇది ప్రజా పాలన? లేక ప్రజల ప్రాణాలతో ఆటలాడటమా? అని జంపన్న ప్రభుత్వం పనితీరుపై మండిపడ్డారు. ఆరోగ్యశ్రీ పథకం నిలిపివేయడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బకాయిల పేరుతో ప్రాణాలు బలిగాకూడదని జంపన్న హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేసి అన్ని ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరించాలి. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవు” అని జంపన్న హెచ్చరించారు.

# కళ్ళకు గంతలు కట్టుకొని డైలీవేజ్ వర్కర్ల నిరసన

**ఏటూరునాగారం, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలి పెండింగ్ వేతనాలు చెల్లించాలి, జీవో నెంబర్ 64ను ఎత్తివేయాలి, బుధవారం ములుగులో బస్సు ప్రమాదంలో మరణించిన గగులోతు శ్రీనుకు నిరవధిక సమ్మె సందర్భంగా తన ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపం తెలియజేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఏడవ రోజు నిరవధిక సమ్మె సందర్భంగా డైలీ వేస్ వర్కర్లు కళ్ళకు నల్ల రిబ్బన్స్ తో కంతలు కట్టుకొని నిరసన తెలియజేశారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎండి దావూద్.(ఉపాధ్యక్షుడు మడే రవి సంఘీభావం) తెలియజేశారు. అనంతరం దావూద్. రవిలు మాట్లాడుతూ 2014లో తీసుకొచ్చిన జీవో 212 జీవో ప్రకారం ఐదు సంవత్సరాలు పూర్తి చేసిన వారికి పర్మినెంట్ చేయాలని జీవోను అమలు చేయకుండా కొత్తగా గత ప్రభుత్వం తీసుకొచ్చి జీవో నెంబర్ 64 ను అమలు చేస్తానంటే నెల జీతంలో జీవో 64 ప్రకారం సగం జీతం తగ్గే అవకాశాలు ఉన్నాయని టైం స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లించాలని. జీవో ప్రకారం పర్మినెంట్ చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వర్కర్స్ నాయకులు ఎం. నాగలక్ష్మి.జి విజయలక్ష్మి. కమల, జయలక్ష్మి, నాగమణి, సరోజన, సారబాబు లతోపాటు సుమారు 140 మంది పాల్గొన్నారు.



# కేటీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం

## కలెక్టర్ దివాకరకు బహిరంగ క్షమాపణ చెప్పాలి





**నూగురు వెంకటాపురం, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌కు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ములుగు జిల్లా నాయకులు నరసింహమూర్తి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదివాసి నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్శ నరసింహమూర్తి అన్నారు. గురువారం మొక్కజొన్న రైతులతో వెంకటాపురం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బహుళ జాతి మొక్కజొన్న విత్తన కంపెనీల చేత నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించిన కలెక్టర్ పై అనుచిత వాక్యాలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాజకీయ విమర్శలు అధికార ప్రతిపక్ష పార్టీల పైన చేసుకోవాలి కానీ రైతుల పక్షాన నిలబడిన దివాకర లాంటి అధికారుల పైన కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సూచించారు. కలెక్టర్ ని ఏదైనా చేయాలనీ చూస్తే ప్రజలు మరోసారి స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్తారని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కలెక్టర్ కు బహిరంగ క్షమాపణలు చెప్పాలని, నరసింహమూర్తిని తక్షణమే పార్టీ నుండి బహిస్కరించాలని డిమాండ్ చేసారు. జిల్లా అధ్యక్షులు కుంజ మహేష్, మండల అధ్యక్షులు ముర్రం రాజేష్, వాజేడు మండల అధ్యక్షులు మోడెం నాగరాజు, వాసం నారాయణ, ఇసుక సహకార సంఘాల జిల్లా అధ్యక్షులు ముర్రం రామలక్ష్మి, నాయకులు పద్మ, చిలకమ్మా, సుశీల, అపర్ణ, కాక రాజు, ఇర్ప బాబు రైతులు, ఆదివాసీ ఇసుక సహకార సంఘాల మహిళలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలి

**నూగురు వెంకటాపురం, సెప్టెంబర్ 18(పీపుల్స్ డైరీ) :** ములుగు జిల్లా కలెక్టర్ దివారక టిఎస్ కు బిఆర్ఎస్ జిల్లా నాయకులు నరసింహమూర్తి బహిరంగ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ర.భ అతిధి గృహ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం వారు మాట్లాడారు. హైదరబాద్ వేదికగా జిల్లా కలెక్టర్ పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కలెక్టర్ కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మండల ప్రజలతో తిరుగుబాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సయ్యద్ హుస్సెన్, బాలసాని వేణు, మన్యం సునీల్, జల్లిగంపల కళాధర్, కొండపర్తి సీతదేవి, చిట్టెం సాయి, పిల్లారిశెట్టి మురళి, వాజేడు కాంగ్రెస్ నాయకులు కాకర్లపూడి విక్రాంత్, ఎల్లయ్య, తదితరులు ఉన్నారు.





## మల్లూరు లక్ష్మీ నరసింహ స్వామి దర్శనానికి వంతెన ఏర్పాటు చేయాలి : లక్ష్మణ్ బాబు

**ఏటూరునాగారం, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** మంగపేట మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి పుణ్యక్షేత్ర దర్శనానికి గుట్టపైకి వెళ్లడానికి లెఫ్ట్ వంతెన ఏర్పాటు చేయాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌ను ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ మల్లూరు గ్రామంలో ఉన్నటువంటి ప్రఖ్యాత గల మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఎత్తైన ప్రాంతంలో ఉన్నందున ఈ యొక్క గుడి ప్రాంగణంలోకి వెళ్లేందుకు ఎత్తైన మెట్లు గుట్ట గా ఉండటంవల్ల భక్తులు ముఖ్యంగా వికలాంగులు వృద్ధులు ఎక్కకుండా ఇబ్బందులకు గురవుతున్నారు. కావున ఈ యొక్క దేవస్థానమునకు లిఫ్ట్(వంతెన) ను ఏర్పరచవలసిందిగా కలెక్టర్ దివాకర టి ఎస్ ని కలిసి వినతి పత్రం అందించి కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ మండల అధ్యక్షులు లింగాల రమణారెడ్డి, పి ఎస్ సి ఎస్ సొసైటీ చైర్మన్ ఎర్రబెల్లి గోపాలరావు, మాజీ పీఏసీ చైర్మన్ వేల్పూరు సత్యనారాయణరావు, ఎమ్మార్పీఎస్ టీఎస్ అధ్యక్షులు గడ్డం భద్రయ్య, బిఆర్ఎస్ జిల్లా నాయకులు ముడుతన పెల్లి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి

తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్



**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం 49వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ కోరారు. గురువారం ముల్కనూర్ అంబేద్కర్ కూడలి వద్ద కరపత్ర ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా చెప్యాల ప్రకాష్ మాట్లాడుతూ భారతదేశ ప్రజలతో పాటుగా ప్రపంచ దేశాలకు పరిచయం చేసే జ్ఞానాన్ని అంబేద్కర్ ఆలోచన విధానం సంఘం పునాదిగా చేసుకుంటూ వారి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా ఉండేటట్లుగా గొప్పతనం కలిగిన అంబేద్కర్ భావజాలం ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. అంబేద్కర్ విగ్రహం నుండి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ వరకు నిర్వహించబడే ర్యాలీలో పాల్గొని సభను విజయవంతం చేసే విధంగా ప్రతి ఒక్కరు కంకణ బద్ధులై మహనీయుల ఆశయాలను కొనసాగించే విధంగా కలిసికట్టుగా పోరాటం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్,ముల్కనూర్ మాజీ సర్పంచ్ మాడుగుల కొమురయ్య,సమ్మక్క సారలమ్మ మాజీ చైర్మన్ మాడుగుల అశోక్,అంబేద్కర్ సంఘం మండల కన్వీనర్ ఎల్తూరి ప్రేమ్ రాజ్,కామెర లక్ష్మణ్ బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా హన్మకొండ జిల్లా ఉపాధ్యక్షులు,సాతూరి చంద్రమౌళి, టిఎమ్ఆర్ పి ఎస్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు అంబాల చక్రపాణి,కొమ్ముల రవి,మ్యాక స్వామి,వేముల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యార్థిగా దేదీప్య

ఆనందోత్సవంలో తల్లిదండ్రులు



**కూకట్ పల్లి,సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** ప్రతి సంవత్సరం భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో, ఉత్తమ విద్యార్థి పురస్కారంలో భాగంగా,ఈ సంవత్సరం కూకట్ పల్లి నియోజకవర్గం లోని, దీనబంధు కాలనీలోని కాకతీయ హైస్కూల్ నుండి, పదవ తరగతి అభ్యసిస్తున్న డి.దేదీప్యను ఉత్తమ విద్యార్థినిగా నిర్ణయించి, అవార్డును అందచేశారు.అనంతరం కాకతీయ స్కూల్ డైరెక్టర్ తిరుపతి రావు మాట్లాడుతూ,విద్యార్థిని దేదీప్య ఎంతో శ్రద్ధతో చదివి, ఉత్తమ విద్యార్థిగా ఎంపికవ్వడం తనకు ఎంతో ఆనందంగా ఉందంటూ,ఇలానే మన స్కూల్ ప్రతీ విద్యార్థి శ్రద్ధతో చదివి ఎంతో ఉన్నతస్థాయికి ఎదిగి,తల్లితండ్రులకు, పాఠశాల యాజమాన్యానికి మంచిపేరు తేవాలంటు,ఇలాంటి పురస్కారాలు మరెన్నో సాధించాలని అన్నారు.విద్యార్థిని అమ్మ నాగమణి మాట్లాడుతూ, వారి కుమార్తె దేదీప్య కు ఉత్తమ విద్యార్థి అవార్డు రావడం నాకు ఎంతో గర్వకారణంగా ఉందని,తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ,కాకతీయ హై స్కూల్ యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే. ఎస్ఎన్. మూర్తి,వైస్ ప్రిన్సిపాల్ పరమేశ్వరి, స్కూల్ ఉపాధ్యాయని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయలు విజయలక్ష్మి,మేరీ,ఆనంద్, మద్దిలేటి,సింధూర్ ప్రభానంద్,ఆఫీస్ స్టాఫ్, కవిత,దుర్గ భవాని,జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## అధికారులతో రోడ్లను పరిశీలించిన కార్పొరేటర్ నార్నే

**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** హైదర్ డివిజన్ పరిధిలోని సమత నగర్ కాలనీ నుండి ప్రగతి నగర్ వెళ్లే మెయిన్ రోడ్,నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్నా ప్రజలు,కాలనీ వాసుల సమాచారం మేరకు ట్రాఫిక్ హార్టికల్చర్, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ వారితో కలసి పరిశీలించిన,హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు.ఈ సందర్భంగా కార్పొరేటర్.మాట్లాడుతూ,ప్రగతి నగర్ మెయిన్ రోడ్ లో ఎలక్ట్రికల్ పోల్స్,ప్రైవేట్ ఇంటర్నెట్ పోల్స్,ఎండిపోయిన చెట్లు వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని ప్రజలు, కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు,అధికారులతో కలసి పరిశీలించి వెంటనే పనులను చేపట్టాలని తెలిపారు.అలాగే ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని,సంతులిత, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. అదేవిధంగా ప్రజలు అందరూ కలిసి డివిజన్ అభివృద్ధి లో భాగస్వాములు కావాలని, డివిజన్ వాసులందరి సమిష్టి కృషితో ఆదర్శవంతమైన డివిజన్ గా తీర్చిదిద్దుతామని కార్పొరేటర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగ్యనగర్ ఎలక్ట్రికల్ ఏఈ దయానంద్, ట్రాఫిక్ ఏఎస్ఐ ప్రభాకర్,జిహెచ్ఎంసి ఎలక్ట్రికల్ లైన్ మెన్ సుధాకర్,హార్టికల్చర్ విభాగం దాసు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## హెటేరో డ్రగ్స్ యూనిట్-1 కంపెనీ దౌర్జన్యం

నల్లకుంట చెరువులోకి విచ్చలవిడిగా వ్యర్థ రసాయనాలు విడుదల



**గుమ్మడిదల,సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి లో ఉన్న హెటేరో డ్రగ్స్ యూనిట్1 ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఎవరు ఏం చేస్తారులే అని ధైర్యంగా వ్యర్థ రసాయనాలు బయటకి విచ్చలవిడిగా వదులుతున్నారు.పక్కనే ఉన్న దోమడుగు గ్రామంలో నల్లకుంటలో నీరు ఎర్రగా మారాయి.వీటి వల్ల చెరువులో ఉన్న చేపలు,చుట్టుపక్కల వరి పొలాలపై నీరు చేరి ఇటు చేపలు చనిపోతున్నాయి.అటు వరి పంటలు నాశనమైతున్నాయి. రైతులు లబోదిబో మంటూ రోడ్డున పడితున్నారు.అసలు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వారు ఏం చేస్తున్నారు.స్థానిక తహశీల్దార్ ల బృందం ఏం చేస్తున్నారు.నిద్ర మత్తులో ఉన్నారా అంటూ గ్రామ వాసులు ఆగ్ర హం వ్యక్తంచేశారు.పట్టపగలే వ్యర్థారసాయనాలు బయటకి వదిలితే, కనీసం ఇటు వైపు కన్నెత్తి చూడని రెవెన్యూ అధికారులు.ప్రతి నెల ఈ కంపెనీ నుంచి అమ్యామ్యా లు అధికారుల బ్యాంకులో పడుతున్నాయి. అందుకే ఇటువైపు ఎవ్వరు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఇప్పటికైనా( పీసీబి)పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు వెంటనే హెటేరో డ్రగ్స్ పై చర్యలు తీసుకోవాలి లేకపోతే ఆ కంపెనీ ముందు ధర్నా చేపడతామని స్థానిక రైతులు,మత్స్యకారులు డిమాండ్ చేశారు.



## నాయకుడిని కాదు... సేవకుడిని!

ప్రజలకు సేవ చేయడమే ముఖ్యం - మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** యూరియా కొరత రైతులను వేధిస్తుండడంతో చెల్లించి పోయిన మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి రెండు కోట్ల రూపాయలను విరాళంగా అందజేశారు.యూరియా తిప్పలు రోజురోజుకు తీవ్రమయ్యాయి. సకాలంలో యూరి యా అందక పంట ముదురుతోంది. పొలాల్లో ఉండాల్సిన రైతులు ప్రైవేట్ దుకాణాలు, ప్రాథమిక సహకార సంఘాల వద్ద క్యూలైన్‌లో తెల్లవారుజాము నుంచే నిలబడుతున్నారు. ఒక్క బస్తా యూరియా కట్ట కోసం వర్షాలను, ఎండలను లెక్కచేయకుండా రైతన్నలు పడిగాపులు కాశారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని లక్షల మంది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒకే బస్తా ఇస్తుండడం తో మళ్లీ మరుసటి రోజు వచ్చి క్యూ కడుతున్నారు. ఇలా గత కొన్ని రోజులుగా రైతులకు ఇవే తిప్పలు. అయినా సరిపోయేంత అందక పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. వరుసగా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడంతో చలించిపోయిన స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మానవత్వాన్ని చాటుకున్నాడు. "నాయకుడిని కాదు.... సేవకుడిని" అని మరొకసారి నిరూపించారు. రైతుల కష్టాన్ని తెరిచిన ఒక రైతుగా, ఒక ఎమ్మెల్యేగా గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాదులో తన కుటుంబ సమేతంగా కలుసుకొని రైతుల సంక్షేమం కోసం రెండు కోట్ల రూపాయలను విరాళంగా అందజేశారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్క రైతుకు ఒక్కొక్క యూరియా బస్తా ఉచితంగా అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు.తన పెద్ద కుమారుడు సాయి ప్రసన్న వివాహం గత కొద్ది రోజుల క్రితం జరిగింది. వివాహ అనంతరం భారీ ఎత్తున రిసెప్షన్ ఏర్పాటు చేయాలని , ఈ రిసెప్షన్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులను ఆహ్వానించాలని నిర్ణయం తీసుకున్నారు. కానీ రైతుల బాధలు చూసి చలించి పోయిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తన కుమారుడి రిసెప్షన్ ను రద్దుచేసి రైతుల సంక్షేమం కోసం విరాళంగా అందజేశారు. రాజకీయాల్లోకి వచ్చింది పదవుల కోసం కాదు ప్రజలకు సేవ చేయడం కొరకు అని మరోసారి నిరూపించారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. నియోజకవర్గంలోని ప్రజలు రైతులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## ధర్మరావుపేటలో బొడ్డెమ్మ సంబరాలు

**గణపురం, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ):** మండలంలోని ధర్మరావుపేట గ్రామంలోని ప్రజల హృదయాలతో నతమయమైన బొడ్డమ్మ సంబరాలు ఈ ఏడాది కూడా శ్రద్ధగా జరిగింది. గ్రామస్తులు కుటుంబసభ్యుల వలే కలసి పాల్గొన్న ఈ ఉత్సవంలో ఉల్లాసాల సందడి గాలింపజేసింది. గురువారం గ్రామంలోని మహిళలు, యువత, చిన్నారులు ఒక్కచోట చేరి పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు. చిన్నారి వృందం ప్రకాశవంతమైన ఆనందంతో "బొడ్డెమ్మ బొడ్డెమ్మా కోల్...బిడ్డలు ఎందరే..." అనే సంప్రదాయ గీతాలను పాడుతూ, ఇంటివిడిచి వీధులయా పరచుకుంటూ ఆడిపాడుతూ పల్లెలో ఉత్తేజం నింపారు. వీరు కలసి మట్టితో బొడ్డమ్మ విగ్రహాన్ని తీర్చిదిద్దారు. ఈ మట్టి బొడ్డమ్మను పూలతో దగ్గరగా అలంకరించి, అందరూ చుట్టూ తిరిగి ఆటపాటలతో ఊరంతా సందడిని సృష్టించారు. ఈ వేడుక సామూహికతకు, సాంప్రదాయ జ్ఞాపకాలకి వేదికగా నిలిచింది. పల్లెటూరి సాంస్కృతిక మూలాలన్నీ ఈ బొడ్డమ్మ పండుగలో జీవించి, కొత్త తరం వారికి మార్గదర్శకమైంది. పల్లె ప్రజల చక్కటి స్నేహసంబంధాలు బంధాలను బలోపేతం చేస్తూ, గ్రామ ప్రజల జీవనాలకు స్ఫూర్తి సంతరించాయి. ఈ సంబరాల్లో పాల్గొన్న గ్రామస్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేసి, "ఇలాంటి ఉత్సవాల వల్ల పరస్పరం కలిసికట్టుతో గ్రామం మరింత అభివృద్ధి చెందుతుంది. పల్లె సంప్రదాయ విద్యను పిల్లలకు తెలియజేయడం చాలా ముఖ్యమే" అని హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకలో ప్రధాన భాగస్వామిగా ఉన్న శ్రీ ఉమా మహేశ్వర సేవా సమితి అధ్యక్షుడు ఆకుల సుభాష్ మాట్లాడుతూ... "గత రెండు సంవత్సరాలుగా సేవా సమితి ఆధ్వర్యంలో ఈ సంబరాలు నిర్వహిస్తున్నాము. భవిష్యత్తులో ఈ వేడుకలను మరింత వైభవంగా, గ్రామ అభివృద్ధికి తోడ్పడేలా వేడుకుంటున్నాం" అన్నారు.





## కెవికేలో అంగనవాడి టీచర్లకు అవగాహన

**జమ్మికుంట, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** జమ్మికుంట కెవికెలో పోషణ్ బి పాడి భీమ్ కార్యక్రమము మూడు రోజులుగా ట్రైనింగ్ ప్రోగ్రామ్ కెవికె జమ్మికుంటలో జరుగుతున్నది . ఈ ప్రోగ్రాం లో పోషణ మరియు విద్య గురించి ఐదు మండలాల అంగన్వాడీ టీచర్లకు అవగాహన కల్పించడం జరిగినది అదేవిధంగా పర్యవేక్షణ గురించి కూడా అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి హుజురాబాద్ సిడిపిఓ స్రుగుణ, కేవీకే ప్రశాంతి సూపర్వైజర్లు రమాదేవి శిరీష స్వరూప జ్యోతి రాజశ్రీ పద్మ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ నాగరాజు ప్రాజెక్టు బీసీ నాగరాజు ప్పాల్గొన్నారు.

## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**కమలాపూర్, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** కమలాపూర్ మండల కేంద్రంలోని గూడూరు గ్రామంలో ఇటీవల అకాల మరణం చెందిన చల్లూరి రాఘవచారి కి చిన్ననాటి నుంచి తమతో కలిసి పదవ తరగతి వరకు చదువుకున్న స్నేహితులు తన మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. పదవ తరగతి నుంచి తమతో కలిసిమెలిసి చదువుకున్న రాఘవాచారి మరణంతో తన కుటుంబం దుఃఖ సంద్రంలోకి వెళ్లింది. తన కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వడం కోసం స్నేహితులంతా రాఘవ చారి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వెళ్లి తమ వంతుగా 1999 -2000 సంవత్సర టెన్త్ బ్యాచ్ స్నేహితులు అంతా కలిసి 15,500 రూపాయలు ఆర్థిక సహాయం అందించి తన కుటుంబానికి మనోధైర్యాన్ని చెప్పారు.. ఈ కార్యక్రమంలో పాక రాజు, నరిగె బిక్షపతి, పాక రమేష్, గూడెల్లి సురేష్, బీరకుంట్ల కుమారస్వామి, నరిగే శ్రీనివాసు, మరి కొంతమంది స్నేహితులు పాల్గొన్నారు.

## రోడ్డుకిరువైపులా ఉన్న చెట్ల తొలగింపు



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముత్తారం నుండి కొత్తకొండ వెళ్లే దారిలో ముత్తారం బస్ స్టాప్ మూలమలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా అధికంగా పెరిగిన చెట్లు,కొమ్మలు, ముళ్ళకంపల తో రోడ్డు ప్రమాదాల నివారణకు గురువారం ముల్కనూర్ పోలీసుల ఆధ్వర్యంలో ఎస్సై రాజు జేసీబిని తెప్పించి చెట్లు,కొమ్మలను తొలగింపజేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ రాజు మాట్లాడుతూ.. మూలమపుల వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్ల కొమ్మలు,పొదలు పెరగడం వల్ల వాహనాలు ఎదురెదురుగా వస్తున్న సమయంలో కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.వాహనదారులు సురక్షితంగా వెళ్లడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులకు వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలను భీమదేవరపల్లి మండలం బిజెపి అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం కొత్తకొండ వీరభద్ర స్వామి సన్నిధిలో అర్చన అభిషేకం చేసి ప్రధాని నరేంద్ర మోడీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అదేవిధంగా ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తా లో కేక్ కట్ చేసి సంబరాలు ఘనంగా నిర్వహించారు. జన్మదినం సందర్భంగా రాష్ట్ర పార్టీ తీసుకున్న నిర్ణయంలో భాగంగా యువ మోర్చా ఆధ్వర్యంలో ఎల్కతుర్తి లో జరిగిన రక్తదాన శిబిరంలో భీమదేవరపల్లి మండలం నుంచి పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ పైడిపల్లి పృథ్వీరాజ్, సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య,జిల్లా నాయకులు ఉష కోయిల కిషన్, చిదురాల రమేష్, దొంగల వేణు,మహిళా నాయకురాలు అంబీర్ కవిత, గుండెల్లి సదానందం,కంకల సదానందం, దొంగల రాణా ప్రతాప్, బొజ్జపురి పృథ్వీరాజ్, కాలేరు వికాస్, ముద్దసాని వీరన్న, అలుగు భాస్కర్, సింగం రాజేందర్,బోడ రమేష్,గుత్పల జశ్వంత్, కుర్రే ప్రశాంత్, కుర్రె అంజి, అబ్బర్, బోయిన శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ కిష్టాపూర్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్

## డీసీపీ నంద్యాల కోటిరెడ్డి



**మేడ్చల్, సెప్టెంబర్ 18(పీపుల్స్ డైరీ) :** మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజల భద్రత, నేరాల నియంత్రణ కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు మేడ్చల్ డీసీపీ నంద్యాల కోటిరెడ్డి అన్నారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు మేడ్చల్ అడిషనల్ డీసీపీ పురుషోత్తం, ఏసీపీ శంకర్ రెడ్డి, సీఐ అద్దాని సత్యనారాయణ ఆధ్వర్యంలో 200 మంది పోలీస్ సిబ్బందితో గురువారం సాయంత్రం మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని 4వ వార్డులో గల 300 ఇళ్లలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి 1000 మంది వ్యక్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సరైన ధృవపత్రాలు లేని 18 ద్విచక్రవాహనాలు, రెండు కార్లను స్వాధీనం చేసుకుని మూడు లిక్కర్ కేసులు, రెండు గంజాయి కేసులు నమోదు చేయగా 188 వాహనాలపై పెండింగ్ లో ఉన్న రూ.91 వేల ట్రాఫిక్ చలాన్లను వసూలు చేయగా డ్రైవింగ్ లైసెన్స్ లేని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 15 వాహనాలను ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేసినట్లు డీసీపీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ నంద్యాల కోటిరెడ్డి మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై, పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. స్థానికంగా ఏలాంటి గొడవలకు పోకుండా ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఉండాలని సూచించారు. నేరాల నివారణ చర్యలలో భాగంగా స్థానిక ప్రాంతాలలో ప్రజలు స్వచ్ఛందంగా కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంక్ ఖాతా వివరాల కోసం వచ్చే కాల్స్, ఈమెయిల్స్‌కు స్పందించవద్దన్నారు. ఎలాంటి అత్యవసర సమయంలో డయల్ 100 నంబర్‌కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేరు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో 10 మంది సర్కిల్ ఇన్స్పెక్టర్లు, 20 మంది సబ్ ఇన్స్పెక్టర్లు, తెలంగాణ స్టేట్ పోలీస్, ఏఆర్ పోలీస్, ఎస్ఓటి, టాస్క్ ఫోర్స్, ట్రాఫిక్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## అకాల వర్షానికి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



**సైదాపూర్, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం వెన్కేపల్లి గ్రామానికి చెందిన కౌలు రైతు మునిపాల శ్రీను పది ఎకరాల పత్తి పంటకు గాను నాలుగు లక్షల రూపాయలు అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టాడు. అయితే ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో పత్తి పంట నీట మునిగి తీవ్ర నష్టం వాటిల్లింది. మునిపాల శ్రీను విలేకరులతో మాట్లాడు తూ 'భారీ వర్షాల కారణంగా పూత, కాయలు పాడై రోగాలు పడ్డాయి. మందులు పిచికారి చేసినా ఉపయోగం లేకపోయింది. ఎంత కష్టపడి వేసిన పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షం పడడంతో మొత్తం నష్టం జరిగింది. అప్పులు బాగా పేరుకున్నా యి. ఇప్పుడు ఈ పరిస్థితుల్లో ఎలా ఎదుర్కోవాలో అర్థం కావడం లేదు" అని కన్నీటి పర్యంతమయ్యాడు. రైతు శ్రీను రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకుంటూ 'మా వంటి కౌలు రైతుల పట్ల పక్షపాతం లేకుండా తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలి. లేకపోతే కుటుంబం మోస్తరంగా బతకడం కష్టమవుతుంది" అని ఆవేదన వ్యక్తం చేశాడు.

## కొడుకులు పోషించడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు



**వీణవంక, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** బేతిగల్ గ్రామానికి చెందిన ఖంభాల రాయమల్లు భార్య చెన్నమ్మ ను తన ఇద్దరు కుమారులు పోషించడం లేదని హుజురాబాద్ ఆర్డిఓ కు ఫిర్యాదు చేయగా ఆర్డీవో ఆదేశాల మేరకు రాయమల్లు పోషణ నిమిత్తం ఇద్దరు కుమారులను ఒక్కొక్కరిని నెలకు 4000 రూపాయలు ఇవ్వాలని ఆదేశం ఇచ్చారు ఆర్డిఓ ఇచ్చిన ఆదేశంను అమలు చేస్తున్నారా లేదా అనే విషయమై జిల్లా కలెక్టర్ కు జిల్లా సంక్షేమ అధికారి ఆధ్వర్యంలోని టీమ్ మెంబర్స్ విచారణ చేపట్టగా తన కుమారులు తనను పోషించడం లేదని రాయమల్లు తెలుపగా ఇద్దరు కుమారులకు కౌన్సిలింగ్ నిర్వహించి తల్లి దండ్రులనీ పోషించాలని పోషించనియెడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోగలమని తెలుపగా కౌన్సిలింగ్ తదనంతరం తన ఇద్దరు కుమారులు తల్లిదండ్రులా పోషణను చూసుకోగలమని కనీస సౌకర్యాలను సమకూర్చగలమని తెలిపారు. ఇ రోజు ఇద్దరి కుమారుల ద్వా రా 16000 రూపాయలు ఇప్పించారు. ఈ విచారణలో ఆర్ ఐ రవి భేథిగల్ డివిసి కౌన్సిలర్ పద్మావతి చైల్డ్ హెల్ప్ లైన్ సాయికిరణ్ గౌడ్ పోలీస్ కానిస్టేబుల్ పి. వినోద్ కుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కృషి, పట్టుదలతో ముందుకెళ్లాలి



**పటాన్‌చేరు, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** విద్యార్థులు కృషి పట్టుదలతో ముందుకెళ్ళినప్పుడే గమ్యాన్ని చేరగలుగుతారని ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పటాన్చెరు లో లైఫ్ సైన్స్ విద్యార్థులు ఫ్రెషర్స్ డే ను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఆది నుండే కృషి పట్టుదల మరియు క్రమశిక్షణతో విజ్ఞానాన్ని సంపాదించాలని దానికి తోడు విద్యార్థులు భవిష్యత్తులో లక్ష్యాన్ని పెంచుకొని లక్ష సాధన కోసం ప్రతిక్షణం తాపత్రయపడాలని దాని అనుకూలంగా కృషి చేయాలని సూచించారు. పటాన్చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో చేరడం విద్యార్థుల యొక్క అదృష్టంగా భావించాలని ఈ కళాశాలలో కార్పొరేట్ స్థాయిని మించి వసతులు కలిగి ఉన్నారని తెలిపారు. విద్యార్థులు నాలుగు గోడల మధ్య విజ్ఞానమే కాకుండా భవిష్యత్తులో బతకడానికి కావలసిన సామాజిక స్పృహను కలిగి ఉండాలని అదేవిధంగా అనేక రకాలైన నైపుణ్యాలను పెంపొందించుకొని ఉపాధి అవకాశాలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేత



**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి చెందిన మంగరాజు అనే వ్యక్తి గత కొన్ని రోజుల క్రితం తన చరవాణిని పోగొట్టుకున్నాడు.ఈ మేరకు ముల్కనూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.పోలీసులు నూతన సాంకేతిక పరిజ్ఞానం(సీఈఐఆర్ )సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ అప్లికేషన్ ను ఉపయోగించి పోయిన సెల్ ఫోన్ ను వెతికి పట్టుకొని బాధితునికి స్వయంగా ఎస్సై రాజు అందజేశారు.ఈ సందర్భంగా పోలీసులకు బాధితుడు మంగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన




**ఆళ్ళపల్లి, సెప్టెంబర్ 18(పీపుల్స్ డైరీ) :** మండలంలోని ప్రజలు ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని స్థానిక పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ సి.హెచ్.వెంకటేశ్వర్లు సూచించారు. ఈ మేరకు గురువారం ఆళ్ళపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై ఎం.సోమేశ్వర్ ఆదేశాల మేరకు ఠాణాలో ప్రజలకు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండి, అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మండలంలో ఎవరూ గంజాయి పంట పండించొద్దని, రవాణా సైతం చేయొద్దని హెచ్చరించారు. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కళాశాల, పాఠశాలలో విద్యార్థులు తోటి మిత్రులను ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని గుర్తు చేశారు. తల్లిదండ్రులు లేదా కుటుంబ సభ్యులు మందలించారని క్షణికావేశంలో యువత ఆత్మహత్యలకు పాల్పడొద్దన్నారు. ఈ అవగాహన సదస్సులో స్థానిక పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్స్ వై.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ పశ్చిమ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షునిగా తాళ్లపల్లి రాజు

**వరంగల్ సెప్టెంబర్ 18(పీపుల్స్ డైరీ) :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షునిగా తాళ్లపల్లి రాజును నియమిస్తూ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు బొచ్చు చందర్ గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గం కాంగ్రెస్ సేవ దళ్ అధ్యక్షునిగా నియామకానికి సహకరించిన కాంగ్రెస్ సేవ దళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయి నీ రాజేందర్ రెడ్డి కాంగ్రెస్ సేవాదళ్ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి సుంకరి శ్రీనివాస్ రెడ్డి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు బొచ్చు చందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## అల్ఫోర్స్‌లో ఉత్సాహంగా బతుకమ్మ ఉత్సవాలు



**హుస్నాబాద్, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** బతుకమ్మ తెలంగాణ రాష్ట్ర సంస్కృతికి ప్రతీక అని ఈ పండగ ద్వారా సమాజంలో ఆనందోత్సవాలు వ్యాప్తి చెందుతాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లోని స్థానిక హనుమాన్ నగర్ లోని అల్ఫోర్స్ హై స్కూల్ లో వైభవంగా నిర్వహించినటువంటి అల్ఫోర్స్ బతుకమ్మ సంబరాల మహోత్సవ్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రారంభానికి ముందు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి దుర్గామాత చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పూజా కార్యక్రమాలు ఆచరించి ఘనంగా ప్రారంభించారు. కళా వైభవం చాటి చెప్పేది బతుకమ్మ పండుగ అని మరియు ప్రకృతిని ఆరాధించేటువంటి పండుగ బతుకమ్మ పండుగ అని గుర్తు చేస్తూ, కుటుంబ సభ్యుల కోలాహలం నడుమ జరుపుకునేటువంటి,చక్కటి చరిత్ర గల పండుగని వారు అభివర్ణించారు.బతుకమ్మ పండుగ ద్వారా వివిధ రకాల పూలను కొలుస్తారని ఆ పూల ద్వారా బతుకమ్మలను పేర్చి ఆనందాన్ని పంచుకుంటారని తెలిపారు. .వేడుకల సందర్భంగా విద్యార్థుల ప్రదర్శించినటువంటి బతుకమ్మ నృత్యాలు,పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి మరియు ప్రాంగణాన్ని వివిధ రకాల పూలతో చక్కగా అలంకరించారు.

# జమ్మికుంటలో యువతి మృతి

## అనారోగ్యమా? అనుమానాస్పదమా?



**జమ్మికుంట, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** జమ్మికుంట పట్టణానికి చెందిన పోరండ్ల తిరుపతమ్మ బుధవారం పోలీస్ స్టేషన్‌కు వచ్చి తన కూతురు శ్రీదేవి మృతి గురించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు.. ఆమె తెలిపిన వివరాల ప్రకారం, తనకు ఒక కూతురు, ముగ్గురు కుమారులు ఉన్నారని, శ్రీదేవిని సుమారు 34 సంవత్సరాల క్రితం జమ్మికుంట లెక్చరర్ కాలనీకి చెందిన దిడ్డి సుధాకర్‌కు ఇచ్చి వివాహం చేయగా వారికి ఇద్దరు పిల్లలు ఉన్నాం్నారు. బుధవారం ఉదయం 6:40 గంటల సమయంలో శ్రీదేవి భర్త దిడ్డి సుధాకర్, తిరుపతమ్మ కుమారుడు పోరండ్ల శ్రవణ్ కుమార్‌కు ఫోన్ చేసి "మీ అక్క చనిపోయింది" అని సమాచారం ఇచ్చాడని, దీంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా, శ్రీదేవి ఇంటి హాల్‌లోని సోఫాపై మృతదేహంగా ఉన్నట్లు గుర్తించామ న్నారు. శ్రీదేవి అనారోగ్యంతో గాని, లేదా మరేదైనా కారణంతో గాని మృతి చెందింద అని భావిస్తున్నామని, న్యాయం చేయాలని కోరుతూ కుటుంబ సభ్యులు ఫిర్యాదు ఇవ్వగా, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు జమ్మికుంట పట్టణ సీఐ తెలిపారు.

పీపుల్స్ డైరీ
కరీంనగర్
శుక్రవారం, 19 సెప్టెంబర్ 2025
సంపుటి : 15, సంచిక : 125




## శ్యామ్ కుమార్ మృతికి సంతాపం

**ఏన్కూర్, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూర్ మండలం ఇమామ్ నగర్ గ్రామంలో మృతి చెందిన బానోత్ శ్యామ్ కుమార్ మృతికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం సంతాపం వ్యక్తం చేశారు. గురువారం శ్యామ్ కుమార్ మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ నాయకులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మండల కార్యదర్శి దొంతిబోయిన నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు వేముల కృష్ణ ప్రసాద్, సిపిఎం నాయకులు గుడ్ల వెంకటేశ్వరరావు,బీ ఆర్ఎస్ పార్టీ నాయకులు బాదావత్ బాలాజీ లతో పాటు వివిధ పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు శ్యామ్ కుమార్ మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు. శ్యామ్ కుమార్ తండ్రి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు బానోత్ బాలాజీ ని,తల్లి సిఐటియు నాయకురాలు బానోత్ అమలను తమ్మినేని వీరభద్రం ఇతర నాయకులు ఓదార్చారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. శ్యామ్ కుమార్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ముగిసిన అంగన్వాడి టీచర్ల శిక్షణ



**ఏన్కూర్, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** ఏనుకూరులో గత మూడు రోజులుగా జరుగుతున్న అంగన్వాడీ టీచర్ల శిక్షణ కార్యక్రమంలు గురువారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రీస్కూల్ కార్యక్రమాలు, పోషన్ మహా ప్రోగ్రాం పై అంగన్వాడీ టీచర్లు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ దయామణి, సూపర్వైజర్లు భవాని,బక్కమ్మ,శిక్షణ నిర్వాహకులు నిహాల్, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## హాస్టల్‌ను తనిఖీ చేసిన అధికారులు



**ఏన్కూర్, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** ఏనుకూరులోని బీసీ బాలుర వసతి గృహాన్ని గురువారం ఎంపీడీవో రంజిత్ కుమార్, ఎంపిఓ జీవీఎస్ నారాయణ తనిఖీ చేశారు, హాస్టల్ పరిసరాలను,స్టోర్ రూమును, స్టాక్ రిజిస్టర్ ను,అటెండెన్స్ రిజిస్టర్ లను, టాయిలెట్లను పరిశీలించారు. సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు సంబంధించిన విద్య,ఆరోగ్యం పై ప్రధాన దృష్టి సారించాలన్నారు. అనంతరం స్థానిక కస్తూరిబా బాలికల విద్యాలయాన్ని సందర్శించి అక్కడ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ లావణ్య పాల్గొన్నారు.

## అఖిల భారత థల్ సైనిక్ క్యాంప్‌కు గీతం క్యాడెట్ ప్రాతినిధ్యం




**పటాన్‌చేరు, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** ఢిల్లీ కంటోన్మెంటులోని ఎన్ సీసీ డైరెక్టర్ జనరల్ క్యాంపులో ఈనెల 1 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన ప్రతిష్టాత్మక అఖిల భారత థల్ సైనిక్ క్యాంపు (ఏఐటీఎస్ సీ) 2025లో గీతం జూనియర్ అండర్ ఆఫీసర్ దాసరి ధనిక్ బాబా పాల్గొని, విజయవంతంగా పూర్తిచేశారు. ధనిక్ దృఢత్వం, క్రమశిక్షణ, అవిశ్రాంతంగా రాణించడం పట్ల గీతం కేర్ టేకింగ్ ఎన్ సీసీ అధికారి అజయ్ ప్రశంసలు కురిపించారు. 'దుమ్ముతో నిండిన పరేడ్ మైదానాల నుంచి ఢిల్లీలోని గొప్ప వేదిక వరకు ఆయన ప్రయాణం నిజంగా ఎన్ సీసీ యొక్క అజేయ స్ఫూర్తిని ప్రతిబింబిస్తోంది' అని వ్యాఖ్యానించారు. ఈ విజయం ఎంతో విలువైనదని, ఇది గీతం ఎన్ సీసీకి చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఈ అద్భుతమైన ఘనత, తరతరాలుగా ఆశావహులైన క్యాడెట్లకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అజయ్ పేర్కొన్నారు. ఈ గర్వించదగ్గ విజయాన్ని సాధించిన ధనిక్ బాబాను గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, స్పోర్ట్స్ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నారాయణరావు చౌదరి తదితరులు అభినందించడమే గాక, ఈ విజయం ముమ్ముందు కూడా కొనసాగాలని ఆకాంక్షించారు.





# సాధ్యమైనంత త్వరగా పెండింగ్ కేసులు క్లియర్ చేయాలి

### పోలీస్ అధికారులతో నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించిన సీపీ

**నిజామాబాద్, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ అధికారులతో నెలవారి సమీక్ష సమావేశం గురువారం పోలీస్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్ యందు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐ.పి.యస్. ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వినాయక చవితి, మిలాద్-ఉన్-నభీ పండుగలను శాంతి యుతంగా నిర్వహించిన సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ విధినిర్వాహనలు నిర్వహించిన సిబ్బందికి "ప్రశంసా పత్రములను " అందజేశారు. రాబోయే దేవినవరాత్రి ఉత్సవాలు , దీపావళి పండుగలను ప్రజలందరూ శాంతియుతంగా నిర్వహించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ అధికారులతో నిర్వహించిన నెలవారి నేర సమీక్షసమావేశంలో పెండింగ్ కేసులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్లో ఉన్న ( అండర్ ఇన్వేస్టిగేషన్) కేసులలో గ్రేవ్ , నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి, గ్రేవ్ మరియు నాన్ గేవ్కేసులలో ఇన్వేస్టిగేషన్ చేసేటప్పుడు ప్రతీకేసులలో క్వాలిటీ ఇన్వేస్టిగేషన్తో పూర్తి పారదర్శకంగా చేయాలి అన్నారు. కేసు నమోదు నుండి చార్జ్షీటు వరకు ప్రతివిషయాన్ని కూలంకుశంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలి అని అన్నారు. పోక్సో మరియు గ్రేవ్ కేసులలో త్వరితగతిన ఇన్వేస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జ్షీటు దాఖాలు చేయాలి అన్నారు. ప్రతీ అధికారికి సి.సి.టి.ఎన్.ఎస్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలి అన్నారు. ఇన్వేస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంటు తెలిసిఉండాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కరించేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసుల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, కొత్త కేసు లతో పాటు చాలా కాలంగా ఉన్న పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం వలన కేసుల సంఖ్య. తగ్గించే విధంగా అన్ని స్థాయిల అధికారులు పనిచేయాలని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్ధవంతమైన సేవలు అందజేస్తూ సత్వరన్యాయం చేసేలా కృషి చేయాలని అన్నారు. వి.పి.ఓ ప్రతీ రోజు గ్రామాన్ని సందర్శించి ప్రజలతో మమేకంమౌతూ నేర నియంత్రణకు కృషి చేయాలని అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాలలో సి.సి కెమెరాల ప్రాముఖ్యత అవగాహణ కల్పిస్తూ ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. సైబర్ క్రైమ్, డయల్ 100 వాటి వినియోగం పై విద్యార్థులకు ప్రజలకు అవగాహణ కల్పించాలని అన్నారు. ఆన్లైన్ మోసాలకు గురి అయినట్లయితే 1930 కాల్ చేసి లేదా ఎన్.సి.ఆర్.పి ఇంకా పోర్టల్ యందు ఫిర్యాదు నమోదు చేయాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలలో బ్లాక్ స్పాట్లుగా గుర్తించి సైన్బోర్డులను ఏర్పాటు చేయించాలని సూచించారు. హైవే రోడ్డులను కలుపుతుఉండే లింక్ రోడ్లకు స్పీడ్ కర్బ్స్ వేయించడం రోడ్డుకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించే విధంగా చూడాలని అన్నారు. రోడ్డు ఇంజనీరింగ్లో లోపాలు ఉన్నట్లయితే నేషనల్ హైవే స్టేట్ హైవే అథారిటి ఇతర సంబంధిత అధికారులతో సమన్వయంతో ప్రమాదాల నివారణకు కృషి చేయాలని అన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ప్రతీ రోజు మీ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్ నిర్వహించి, ఓవర్ స్పీడ్, త్రిబల్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో రోడ్డు భద్రత నిబం ధనల గురించి అవగాహణ కల్పించాలన్నారు. విజిబుల్ పోలిసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని దొంగతనాలు జరగకుండా పాతనేరస్థుల కదలికలపై నిఘా ఉంచాలని అన్నారు.

## అమెరికా సుంకాలపై ప్రతీకారం ఉండబోదు

### గీతం ఆతిథ్య ఉపన్యాసంలో స్పష్టీకరించిన ఐఐఎం ఇండోర్ అధ్యాపకుడు డాక్టర్ అజీమ్ ఖాన్



**పటాన్‌చేరు, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా భారతదేశం అమెరికా సుంకాలపై ప్రత్యక్ష ప్రతీకార చర్యలకు దిగబోదని ఐఐఎం ఇండోర్ అర్థశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మొహమ్మద్ అజీమ్ ఖాన్ అభిప్రాయపడ్డారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'సుంకాల యుద్ధం: ఆర్థికవేత్తల దృక్పథం' అనే అంశంపై గురువారం ఆయన ఆన్ లైన్ ద్వారా ఆతిథ్య ఉపన్యాసం చేశారు. అధిక సుంకాలను దౌత్యం మార్గంలో చర్చల ద్వారా తగ్గించుకునేందుకు ఓవైపు ప్రయత్నిస్తూనే, మరోవైపు ఇతర దేశాలకు ఎగుమతి అవకాశాలతో పాటు దేశీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మద్దతు ఇచ్చే మార్గాన్ని భారత దేశం అవలంబిస్తోందన్నారు. సాధారణంగా, దేశీయ పరిశ్రమలను రక్షించడానికి, దుర్బల రంగాలలో ఉద్యోగాలను కాపాడటానికి, ఆదాయాన్ని సంపాదించడానికి, వాణిజ్య అసమతుల్యలతలను పరిష్కరించడానికి, జాతీయ భద్రతను కాపాడుకో వడానికి, డంపింగ్, విదేశీ సబ్సిడీల వంటి అన్యాయ మైన పద్ధతులను ఎదుర్కోవడానికి మాత్రమే సుంకాలు విధిస్తారని డాక్టర్ ఖాన్ వివరించారు. భారతీయ వస్తువులపై ఇటీవలి 50 శాతం అమెరికా సుంకాలు వస్త్ర రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయని, ఆర్డర్లు నిలిచిపోయాయని అన్నారు. రత్నాభరణాలు, తోలు, సముద్రఉత్పత్తులు, రసాయనాలు వంటి ఇతరరంగాలు కూడా దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఈ చర్యలు భారతదేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)ని 0.3-0.5 శాతం తగ్గించవచ్చుని, తద్వారా 4 నుంచి 5 బిలియన్ డాలర్ల ఎగుమతులు తగ్గడంతో పాటు రూపాయి విలువ కూడా క్షీణించే ప్రమాదం లేకపోలేదన్నారు. అమెరికా సుంకాల వల్ల యేటా 2.985 బిలియన్ డాలర్ల విలువైన భారతీయ ఎగుమతులను ప్రభావితం చేస్తాయని, తద్వారా 723.74 మిలియన్ డాలర్ల సుంకాలు అమెరికా కోల్పోతుందని డాక్టర్ ఖాన్ తెలియజేశారు. తొలుత, జీఎస్ హెచ్ఎస్ ఇన్-ఛార్జి డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ థరు అతిథిని స్వాగతించగా, సమన్వయకర్త డాక్టర్ అథారీ జానిసో వందన సమర్పణ చేశారు.

## సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ సింహపురి కాలనీలో సీసీ రోడ్డు పూర్తిగా పాడువటంతో,తీవ్ర ఇబ్బంది అవుతుండడంతో కాలనీ వాసులు నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించారు. వారి సమ్యసపై స్పందించి, కార్పొరేషన్ ఫండ్స్ ద్వారా సిసి రోడ్ నిర్మాణానికి మంజూరు చేయించి, శంకు స్థాపన కార్యక్రమంలో ముఖ్యఅ తిథులుగా నియోజ కవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కాలనీ వాసులు శాలువాతో సత్కరించి,ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో 2వ డివిజన్ కార్పొరేటర్ చిట్ల దివాకర్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి, వీరబాబు,ఆది రెడ్డి, నారాయణరెడ్డి, వాసు, ఆంజనేయ వర్మ,శ్రీనివాస్, రఫాత్,ప్రశాంత్ రెడ్డి, సందీప్,మహేష్,కాలనీ అధ్యక్షు లు నర్సింహా రెడ్డి, బాల్ రెడ్డి,సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాసరావు, రామ్‌కుమార్, సత్యనారాయణ రావు, శ్రీనివాస్, అఖిల్,కాలనీ వాసులు పాల్గొన్నారు.



## పంచాయతీ కార్యదర్శిపై చేసిన ఆరోపణలు అవాస్తవం

### రిజిస్ట్రేషన్ విషయంలో గ్రామ కార్యదర్శికి సంబంధం లేదు

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** మిర్యాలగూడ మండలం అవంతిపురం గ్రామంలో ఉన్న నా ఇంటి స్థలం గ్రామపంచాయతీ రికార్డులు నమోదైన విషయంలో నాగమణి చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని ఉట్కూరి అరుణ అన్నారు. గురువారం విచారణ అధికారికి వాగ్మూల పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మా ఇంటి స్థలం వివాదం గత మూడు సంవత్స రాలుగా నడుస్తున్నదని ఈ విషయం కోర్టులో కేసు నడుస్తుందని తెలిపారు. గ్రామపంచాయతీ రికార్డులు పేరు నమోదు చేసిన విషయంలో గ్రామపంచాయతీ అధికారి గాయత్రి ప్రమేయం ఉందని నాగమణి ఆరోపణ చేయడం సరైనది కాదని చెప్పారు. ఈ విషయం లో గ్రామ కార్యదర్శి గాయత్రికి ఎలాంటి సంబంధం లేదన్నారు. కార్యదర్శి గాయత్రి మా గ్రామానికి రాకముందని రికార్డులో పేరు నమోదు అయిందని స్పష్టం చేశారు. ఈ విషయంపై అధికారులు విచారించి వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు.

## ఎల్‌ఓసి చెక్కు అందజేత



**మిర్యాలగూడ/నల్గొండ సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** నల్గొండ పట్టణానికి చెందిన కారింగుల శిరిష సతీష్ దంపతుల 2 ఏళ్ల కుమార్తె హర్షిత అనారోగ్య సమస్యతో బాధపడుతూ నిమ్స్ హాస్పటల్లో చికిత్స పొందుతున్నది. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో హర్షితకు ఉన్నత వైద్యం కోసం మంజూరైన లక్ష రూపాయల ఎల్ఓసి చెక్కును పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి హర్షిత తండ్రికి అందజేశారు. ఎల్ఓసికి సహకరించిన మంత్రికి లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకుడు, 29 వార్డు ఇన్చార్జ్ వడ్డేపల్లి కాశీరాం, కారింగుల నాగరాజు పాల్గొన్నారు.



## సెల్‌ఫోన్ కొనివ్వలేదని ఇంట్లో నుంచి వెళ్లిపోయిన బాలుడు

దుండిగల్,సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని, బౌరంపేట ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉండే,రవీంద్రనాథ్ నాయక్ కొడుకు,నిఖిల్ నాయక్ 15 సంవత్సరాలు,పదవ తరగతి చదువుతున్నాడు, తల్లితండ్రులు,ఎన్నిసార్లు అడిగినా ఫోన్ కొనివ్వడం లేదని,ఇంట్లో నుంచి అలిగి వెళ్లిపోయాడు,ఈ ఫోటోలో కనిపిస్తున్న విద్యార్థి, ఎవరికైనా కనబడితే, దుండిగల్ పోలీసులకు (918712581232, 918712663279) వారికి తెలియజేయగలని అన్నారు.

## మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి జన్మదిన వేడుకలు

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 18 (పీపుల్స్ డైరీ) :** చేవెళ్ల మాజీ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శిరీష సత్తూర్. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ఎల్లప్పుడూ ప్రజల బాగోగులు చూసుకుంటూ,ఎన్నో స్వచ్ఛంద సేవ కార్యక్రమాలు చేస్తూ,ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులు,రంజిత్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, ఆమె మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మధు, గాయత్రి,శ్రీనివాస్ గౌడ్, పద్మ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT SATYANARAYANA PRINTERS, H.NO.4-6-144, TILAK ROAD, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA, STATE. PUBLISHED AT H.NO. 10-3-488, OPP: RTC WORK SHOP, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA STATE,
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com